ఆదివారం
ప్రజాశక్తి
ఏప్రిల్ 11, 2004

అల్లరి పిడుగులకు ఆటవిడుపు.....

హ్యాపీ బర్త్‌డే

(11-4-2004నుండి 17-4-2004వరకు)

జాన్ విల్సన్‌రాజ్
6సం॥, 11.4.1998
రజని- విజయ్‌రాజ్
అడ్డగుట్ట-సికింద్రాబాద్

కె. శివకుమార్
2సం॥, 11.4.2002
శోభారాణి-నర్సింలు
శంకర్‌పల్లి-రంగారెడ్డి

తిరుపతి
1సం॥, 11.4.2003
వసుంధర-పొచ్చెన్న
రాంనగర్-ఆదిలాబాద్

ఆర్.శిల్ప
1సం॥, 12.4.2003
ఇంద్రజ-శ్రీనివాస్
జియాగూడ-హైదరాబాద్

జె.సాత్విక
2సం॥, 13.4.2002
సావిత్రి-శ్రీనివాస్
అశోకా కాలనీ-హన్మకొండ

మేగ్నా
1సం॥, 13.4.2003
మాధురి-శ్యామల్‌రావు
అరకువెల్లి-విశాఖ

జి.చరణ్
2సం॥, 15.4.2002
పావని-వినోద్
గోల్‌నాక-హైదరాబాద్

వేణుగోపాల్
1సం॥, 16.4.2003
ఉమారాణి-ముత్యాలరావు
చినగోపతి-ఖమ్మం

వంశీధరరెడ్డి
2సం॥, 17.4.2002
మాధవి-రామిరెడ్డి
మోదుకూరు-గుంటూరు

కె. రాజేశ్వరి
1సం॥, 17.4.2003
సుజాత-ముకుందమ్
చాదిప్ప-రంగారెడ్డి

జి. కీర్తి(మహి)
2సం॥, ఏప్రిల్-2002
నాగమణి-పెంచలయ్య
ముత్తుకూరు-నెల్లూరు

గమనిక: పదేళ్ళ వయస్సు వరకు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:

హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, 1-1-298/4,
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం

రీడర్స్ మెయిల్

'మన పార్లమెంట్' బాగుంది

28 మార్చి 2004 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో కవర్‌స్టోరీ కథనం 'మన పార్లమెంట్' చదివిన తర్వాత పార్లమెంట్ తీరుతెన్నులు, తొలిసారి పార్లమెంటుకు జరిగిన ఎన్నికలలో ఎవరెన్ని స్థానాలు గెలుచుకున్నారు, రాజ్యాంగ సభలో తొలిరోజు, ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా పేరుపొందిన తీరు, పార్లమెంటు మ్యూజియం గూర్చి పూర్తి సమాచారం తెలుసుకోగలిగాం. అదే విధంగా ఆరోగ్యం పేజీలో 'ప్రపంచాన్ని వణికిస్తున్న మలేరియా' వ్యాధి గురించి, వ్యాపించే విధానం, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, మలేరియా వ్యాధి వృద్ధి చెందురీతి, చేయకూడని పనుల గూర్చి సమగ్ర సమాచారం తెలుసుకున్నాం. ప్రతివారం ఆరోగ్యం పేజీలో మంచి శీర్షికలు అందిస్తున్న ప్రజాశక్తి ఆదివారం అనుబంధంకి ధన్యవాదాలు.

– కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్ జిల్లా

ఆచార్య నాగార్జుని గురించి తెలిసింది



మార్చి 28 ఆదివారం అనుబంధంలో టూరిస్ట్‌గైడ్ శీర్షికన ప్రచురితమైన 'ఆచార్య నాగార్జునుడు బోధించిన చోటు' అనే శీర్షిక ద్వారా మాకు తెలియని ఎన్నో విషయాలు విశదపరిచారు. నాగార్జునసాగర్ యొక్క చరిత్ర, విశిష్టత ఎంతో చక్కగా వివరించారు. నల్గొండ జిల్లాలో పుట్టి పక్కనే వున్న వారికి కూడా దీని గురించి సరిగ్గా తెలియదు. ఇంత చక్కని విషయాన్ని అందించినందుకు ఆదివారం అనుబంధానికి నల్గొండ జిల్లా ప్రజల తరఫున మీకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నాను.

– మిరియాల దుర్గారెడ్డి,
మిర్యాలగూడ, నల్గొండ జిల్లా

పిట్టకొంచెం, బొమ్మలు ఘనం

28 మార్చి 2004 ఆదివారం అనుబంధంలో కళాసాహితి శీర్షికన ప్రచురించిన 'పిట్టకొంచెం, బొమ్మలు ఘనం చిత్రకళకు జీవం పోసి, చిత్రకళను జీవింపచేస్తున్న చిన్నారి మాధురి భావనకు చిత్రకళపట్ల ఉన్న అభిమానం ఆమె చిత్రకళానైపుణ్యానికి గొప్ప నిదర్శనం. ముందు ముందు మరెన్నో చిత్రకళాఖండాలు చిన్నారి హస్తాల నుండి రూపుదిద్దుకోవాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను.

– మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా.

కథ నచ్చలేదు..

మార్చి 28వ తేదీ ఆదివారం సంచికలో ప్రచురించిన అమెరికా అమ్మాయి కథ మాకు నచ్చలేదు. కథాంశం ఇపుడొచ్చే అర్థం పర్థంలేని సినిమాలకు మాత్రమే సరిపోతుంది. ఆంధ్రప్రదేశ్ యువకుడు అథ్లెటిక్స్‌లో ప్రపంచ రికార్డు సృష్టించడం, అమెరికా అమ్మాయిని ప్రేమించి వివాహమాడటం అనే అంశంపై రాసిన ఆ కథ మన పరిస్థితులకు ఏమాత్రం సరిపోదు. ప్రజాశక్తిలో వాస్తవికంగా ఉండే కథలనే ప్రచురించగలరని కోరుతున్నాము. పార్లమెంట్‌పై అందించిన కవర్‌స్టోరీ వల్ల చాలా విషయాలు తెలుసుకోగలిగాము.

సత్యాజీ, విశాఖపట్టణం.
పి. సుధ, తిరుపతి.
వి. సుబ్బారావు, సత్తెనపల్లి, గుంటూరు.

రియల్‌స్టోరీ స్ఫూర్తిదాయకం

తెలంగాణ దొరతనానికి ప్రతీకగా ఉన్న దొర గడీ ఇప్పుడు పాఠశాలగా మారిన ఉదంతం స్ఫూర్తిదాయకంగా ఉంది. ఐఐటి రామయ్య గారు రాసిన 'కల్లెడ సంస్కృతి అంతటా వ్యాపించాలి' అంటూ వరంగల్ జిల్లాలోని ఓ పల్లెలోని పాఠశాల గురించి ప్రజాశక్తి రియల్‌స్టోరీ ద్వారా తెలుసుకున్నాం. ఇప్పటికీ బడి లేని పల్లెలు తెలంగాణాలో చాలా ఉన్నాయి. అటువంటి గ్రామాల్లో కూడా దొర గడీలను బడులుగా మారిస్తే బాగుంటుంది. ఇందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ప్రజాశక్తి ఆదివారం సంచికలో అందిస్తున్న వ్యాసాలు, ఔరా, టూరిస్ట్‌గైడ్, న్యాయనలహాలు ఎంతో సమాచారాన్ని అందిస్తున్నాయి. కార్టూన్ శీర్షిక కూడా సరదాగా ఉంటోంది.

ఆర్. నరసింహారెడ్డి, జనగాం, వరంగల్ జిల్లా.
కె. శ్రీనివాసరావు, పెనమలూరు, కృష్ణా జిల్లా.
ఎస్. అప్పారావు, కూకట్‌పల్లి, హైదరాబాద్.

మనలో మాట

నేటి రాజకీయం

అధికారామృతాన్ని ఎంత తాగినా దాహం తీరదంటారు...

ఆ అమృతం అందుకున్నవాడు తాగుతూనే ఉంటాడు..

అందని వాడు వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉంటాడు...

అందినట్లే అంది చేజారిపోతే... ఇక ఆ జీవి పరిస్థితి ఏమిటి?

ఈ అధికార దాహం అనేది ఈనాటిది కాదని వాల్మీకి, వ్యాసుడు ఏనాడో చెప్పారు.

అధికారం కోసం ఎంతకైనా తెగించడం, రక్తసంబంధాన్ని కూడా చూడకుండా వెన్నుపోట్లు, దొంగచాటు యుద్ధాలు చేయడం రామాయణ, మహాభారతాల్లోనే చెప్పేశారు.

వాలి నుండి రాజ్యాన్ని పొందాలనుకున్న సుగ్రీవుడు రాముడి సాయం తీసుకున్నాడు. చెట్టుచాటు నుండి అన్నను చంపించి రాజ్యం హస్తగతం చేసుకున్నాడు.

విభీషణుడు అంతే.. అన్నతో విభేదించాడు. రావణుడి మరణ రహస్యం రాముడికి చెప్పి అతన్ని చంపించాడు. ఆ తర్వాత లంక ఎవరి పరమైందో అందరికీ తెలుసు....

ఇక మహాభారతం గురించి చెప్పనే అక్కర్లేదు.. హస్తినాపుర పీఠం కోసం అన్నదమ్ముల పిల్లలు కురుక్షేత్ర యుద్ధమే చేశారు. ఇక్కడా వెన్నుపోట్లు, అధర్మయుద్ధాలు, శకుని మామ రాజకీయాలు, శల్య సారథ్యాలే పాండవుల విజయానికి దోహదపడ్డాయి...

రామాయణం, మహాభారతాలైనా, నేటి భారతమైనా ఏ యుద్ధానికైనా అధికారమే అంతిమ లక్ష్యం....

ఇప్పుడూ అంతే.....

ఈనాటి పాలకపార్టీల్లో ఉన్నదీ ఆనాటి వారి వారసులే గనుక...

రామాయణంలోని కైకేయి, సుగ్రీవుడు, విభీషణుడు, భారతంలోని శకుని, శల్యుడు, లంకాదహనం చేసిన భక్త హనుమాన్లూ మనకు కనిపిస్తారు... అప్పుడప్పుడూ అభిమన్యులూ కనిపిస్తారు...

నాటి వారసులు, వారి లక్షణాలు ఉండటం వల్లనే దశాబ్దాల పాటు అధికారాన్ని అందించిన పార్టీలను తృణప్రాయంగా త్యజించడం, టిక్కెట్ల కోసం వైరి పక్షాన్ని దేబిరించడం, అక్కడా రాకపోతే స్వతంత్రించడం ఈనాటి రాజకీయులకు సర్వసాధారణమైపోయింది....

తాము 'పూజించే' నాయకులకు టిక్కెట్లు ఇవ్వకపోతే అపర ఆంజనేయుల అవతారం ఎత్తి అప్పటివరకు కార్యాలయమే స్వర్గంగా భావించినవారు దహనకాండకు పాల్పడటం...ఇవన్నీ అలనాటి శౌర్య ప్రతాపాలే...

గోడ దూకి వచ్చిన వెంటనే టిక్కెట్లు ఇవ్వడం, ఇంకా ఎవరు గోడ దూకుతారా అని ఎదురు చూడటం, ఎదుటి పక్షాన్ని చీల్చి చెండాడటం వగైరా యుద్ధ తంత్రాలన్నీ వాల్మీకి, వ్యాసుడూ చెప్పినవే... అన్నీ శల్య సారథ్యాలూ, శకుని రాజకీయాలే....

అన్నదమ్ముల అనుబంధం...

తోడల్లుళ్ళ రాజకీయం...

బావ మరుదుల సవాల్...

గురుశిష్యుల బంధం..

స్నేహితుల యుద్ధం..

స్టార్ వార్స్... వగైరా వగైరా అన్నీ ఆనాటివే....

ఇప్పుడు అదనంగా చేరింది ఒక్కటే.... అదే డబ్బు..

డబ్బు ఖర్చు పెట్టేవాడిదే ఈనాటి అధికారం....

ఇదండీ నేటి రాజకీయం...

ఈ సంచికలో . . .

ఔరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
కథ	. . . 8
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

సాంస్కృతిక బంధం!

జీవనశైలి ... 10

స్వరాంజలి

రియల్‌స్టోరీ...14, 15



కూచిపూడి నాట్యం పుట్టిల్లు కృష్ణాజిల్లా

టూరిస్ట్ గైడ్ . . . 21

ప్రజానటుడు

కళాసాహితి . . . 22, 23

ఔరా!

దొంగలూ క్రికెట్ ప్రియులే!



ప్రస్తుతం ఉపఖండానికి క్రికెట్ జ్వరం పట్టుకుంది. చాలాకాలం తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. శ్యామ్‌సంగ్ కంపెనీ సమర్పించిన ఒన్‌డే మ్యాచ్‌లు పాకిస్తాన్‌లో ఐదు రోజులపాటు జరిగాయి. హైదరాబాద్ నగరంలో రోజూ హత్యలు, దొంగతనాలు ఇంకా అనేక చిల్లర నేరాలు ఇబ్బడి ముబ్బడిగా జరుగుతుంటాయి. అయితే ఇండో-పాక్‌ల మధ్య ఒన్‌డే మ్యాచ్‌లు జరిగిన రోజుల్లో నగరంలోని ఏ పోలీస్ స్టేషన్‌లోనూ నేరాలు నమోదు కాలేదట! నేరస్థులు, దొంగలు కూడా క్రికెట్ ప్రియులే కావడంతో ఆ కాసేపు నేరాలకు సెలవు ప్రకటించి, పోలీసులు కూడా క్రికెట్ చూడటానికి అవకాశం ఇచ్చారట. భారత్-పాకిస్తాన్ మధ్య రోజూ క్రికెట్ జరిగితే ఇక హైదరాబాద్‌లో ఎటువంటి నేరాలు జరగవని పోలీసులు అనుకుంటున్నారేమో?! పనిభారం తగ్గుతుంది కదా?!

కంప్యూటర్ల కంటే టాయిలెట్స్ బెటర్!

పరిశుభ్రత విషయానికి వస్తే అమెరికాలో కంప్యూటర్ల కీబోర్డ్స్, మౌజ్‌లు, టెలిఫోన్ల కంటే టాయ్‌లెట్ సీట్స్ చాలా మెరుగని ఇటీవలి ఒక అధ్యయనం వెల్లడించింది. ఆరిజోనా విశ్వవిద్యాలయంలోని ఒక బృందం కార్యాలయాల్లో పరిశుభ్రత గురించి పరిశోధన జరిపింది. టెలిఫోన్ రిసీవర్ మీద చదరపు సెంటీమీటర్‌కు 3894 క్రిములు ఉండగా, కంప్యూటర్ కీబోర్డ్‌పై చ.సెం.మీకు 511, మౌజ్‌లపై 60 క్రిములున్నాయని తేలింది. కార్యాలయాల్లో సగటున చ.సెం.మీకు 3,249 క్రిములున్నాయట. టాయ్‌లెట్ సీట్లతో పోలిస్తే కార్యాలయాల్లో 400 రెట్లు అధికంగా క్రిములున్నాయని వారి పరిశోధనలో తేలింది. కార్యాలయాల్లోని బల్లలు అపరిశుభ్రతకు నిలయాలని అధ్యయన బృందం కితాబునిచ్చింది. అందరికీ సుద్దులు చెబుతూ కార్యాలయాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల కంప్యూటర్లు, ఫోన్లతో పనిచేసేవారిని నిరంతరం దగ్గు, జలుబు పీడిస్తున్నాయట.



మందు తెచ్చిన తంటా!

ఆయన ఓ బ్యాంక్ మేనేజర్. సాయంత్రం పని అయిన తర్వాత ఆఫీసులోనే 'మందు' పుచ్చుకున్నారు. అప్పుడేమవుతుంది? మణిపూర్‌లోని కిసాన్ గ్రామీణ్ బ్యాంక్‌కు చెందిన ఓ బ్రాంచ్ మేనేజర్ శనివారం సాయంత్రం మందు సేవించి ఆనక బ్యాంక్‌కు తాళం వేయడం మరిచిపోయి ఇంటికి వెళ్ళిపోయారట! అర్ధరాత్రి తర్వాత కూడా బ్యాంక్ తలుపులు తెరిచే ఉండటాన్ని స్థానిక ప్రజలు చూసి పోలీసులకు కబురు చేశారట? వారు వచ్చి బ్యాంకుకు తాళం వేసేసి తమ వద్ద ఉంచుకున్నారు. అంతేగాకుండా ఈ మేనేజర్ గారి భాగోతం బ్యాంక్ ఉన్నతాధికారులకు చెప్పారట. ఇంకేముంది, ఉద్యోగానికి రావద్దులే ఇంట్లోనే కూర్చుని మందు తాగమని బ్యాంక్ అధికారులు సలహా ఇచ్చేరుట! పాపం మందు ఎంత పనిచేసింది?


అసమతి జ్వాలలు
టీడీపీ
కాంగ్రెస్
ఆగని మంటలు

కార్టూన్ కదంబం


ఓటేస్తే చంద్రబాబు
మళ్లీ అధికారమిస్తే అందరికీ గ్యాసు —బాబు
నారు


ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నక్సల్స్‌కు భయపడకుండా ముందడుగు వేయండి
ఓటు

అల్లరి పిడుగులకు ఆటవిడుపు

అల్లరి పిడుగులకు హాలీడేస్...
సరదా కలిసిన జాలీడేస్...
అల్లరి... ఆటలు... సరదాలు... సందళ్ళు...
కేరింతలు...తుళ్ళింతలు...
పిల్లలకివి ఆటవిడుపు రోజులు...
మరి పెద్దలకు ...?
ఇష్టమొచ్చినట్టు గంతులు వేస్తూ... ఎండలో తిరుగుతూ... గొడవలు పడుతూ... చిల్లరిగా తయారవుతారనీ... ఆరోగ్యం పాడుచేసుకుంటారని... సమయం వృథా చేసుకుంటారనీ... ఇలా ఎన్నో భయాలు...
కాబట్టే వారిని కట్టడి చేయాలనుకుంటారు.
కానీ ఏడాది పొడవునా 'చదువు'కొమ్మంటూ హింసపెట్టిన వారిని ఈ కొద్ది రోజులైనా స్వేచ్ఛగా వదిలిపెట్టాలనీ అప్పుడే వారిలో సృజనాత్మకత పెరుగుతుందని విద్యావేత్తలు, మానసిక వేత్తలు చెబుతున్నారు.
మరీ కావాలనుకుంటే వారికిష్టమైన పని చేయడానికీ, ఆసక్తి ఉన్న వాటిని నేర్చుకోవడానికి ఈ వేసవి సెలవుల్లో ప్రోత్సహించమనీ అంటున్నారు.
ఇలా వేసవి సెలవులపై పిల్లలు, తల్లిదండ్రులకు, మానసిక వేత్తలకు ఉన్న అభిప్రాయాలకు ఒక రూపాన్నిచ్చేవి వేసవి శిబిరాలు.
వీటిపై ఒక సమగ్ర అవగాహన కల్పించేందుకే ఈ కథనం..

నేలంటి మధు

విద్యాలయాలు పనిచేసే రోజుల్లో పిల్లలంతా బిజీయే! ఏమాత్రం తీరికలేని చదువులు. అందుకని ఏకధాటిగా 45 రోజులు సెలవులొస్తున్నాయంటే వారు ఎంతో లీజర్‌గా ఫీలవుతారు. ఇన్ని రోజులు ఏం చేయాలా? సరదాగా ఎక్కడికెళదామా? అని ఆలోచిస్తుంటారు. స్కూళ్ళుంటే రెస్ట్ లేదనే చిరాకు, ఇప్పుడేమో ఇన్ని రోజులు ఖాళీగా కూర్చోవాలంటే కూడా బోర్ కొడుతుంది. అందుకని వారి వారి పరిధుల్లో కొత్త కొత్త ఆలోచనలు చేస్తుంటారు.

ప్రణాళికలు వేసుకుంటూ కార్యక్రమాలు సిద్ధం చేసుకుంటుంటారు.

వారి అల్లరికి భయపడే తల్లిదండ్రులు తమ పిల్లలను ఇన్ని రోజులూ ఎలా 'ఫిక్స్' చేయాలా? అని ఆలోచిస్తుంటారు. వివిధ పద్ధతుల గురించి ఆలోచిస్తుంటారు.

ఇటు పిల్లల బోర్‌నూ, పెద్దల భయాన్నీ దూరం చేసే ఉపాయం ఏదైనా ఉందా అంటే నిస్సందేహంగా ఉందనే చెప్పవచ్చు. వీటితో పాటు సమయాన్ని కూడా సక్రమంగా ఉపయోగంలోకి తేగలిగేవి 'వేసవి శిక్షణా శిబిరాలు'. వేసవి కాలంలో పిల్లల అభిరుచులకు, పెద్దల ఇష్టాలకు తగిన శిక్షణ లభిస్తోందీ శిబిరాల్లో. వివిధ వృత్తులు, వ్యాపకాల్లో పిల్లల ఆసక్తికి ఆలంబనగా ఉంటూ ఆ అంశంలో నేర్పును కలిగిస్తూ ప్రతిభకు సానబెట్టి వారిని ప్రోత్సహిస్తున్నాయి. కాబట్టే ఇటీవలి కాలంలో వేసవి శిబిరాలకు ఆదరణ పెరిగింది.

ఢిల్లీ, ముంబై వంటి మెట్రో నగరాల్లో చాలా కాలం నుంచే సమ్మర్ క్యాంపులు పనిచేస్తూ పిల్లలకు వివిధాంశాల్లో శిక్షణనిస్తున్నాయి. అనేక బడా పారిశ్రామిక సంస్థలు కూడా తమ సంస్థల్లో పనిచేసే సిబ్బంది పిల్లల కోసం ఈ తరహా శిబిరాలు నిర్వహిస్తున్నాయి. మన రాష్ట్రంలో దాదాపు మూడు దశాబ్దాల నుంచీ వీటి ఉనికి ఉన్నా ఇటీవలి కాలంలో రాష్ట్రమంతటా బాగా విస్తరించి పిల్లల, పెద్దల ఆదరణను పొందుతున్నాయి. దానితో ఎక్కడ చూసినా వేసవిలో వీటి సందడి కనిపిస్తోంది. ప్రభుత్వ సంస్థలే కాకుండా అనేక ప్రయివేటు, స్వచ్ఛంద సంస్థలు వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నాయి. పిల్లల్లోని ప్రతిభా పాటవాలను వెలికి తీసే సదాశయంతో వీటిని నిర్వహించే సంస్థలు కొన్ని అయితే వ్యాపారంగా నిర్వహించే వారింకొందరు. వీరి సంగతి ఎలా ఉన్నా వీటి సంఖ్య మాత్రం ఏటికేడూ పెరుగుతూ శిక్షణ పొందుతున్న బాల బాలికల సంఖ్యను కూడా గణనీయంగా పెంచుతున్నాయి. వీటిలో ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వ క్రీడాసంస్థ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ నగరపాలక సంస్థ ప్రతిఏటా క్రమం తప్పకుండా వేసవి శిబిరాలు నిర్వహిస్తూ మంచి పేరు పొందాయి.

కార్యక్రమాలేమిటి ? : ఈ శిక్షణా శిబిరాలు సాధారణంగా ఏప్రిల్ రెండో వారంలో ప్రారంభమై మళ్ళీ స్కూళ్ళు తెరిచే వరకూ అంటే దాదాపు జూన్ మొదటి వారం వరకూ ఉంటాయి. అయిదు నుంచి 16 ఏళ్ళలోపు బాలబాలికలు వీటిలో చేరవచ్చు. రోజుకి అయిదారు గంటల పాటు వివిధాంశాల్లో ఇవి శిక్షణ ఇస్తాయి. కొన్ని సంస్థలు ప్రత్యేక అంశాల్లోనూ, మరికొన్ని బాగా ఆదరణ పొందిన అయిదారు అంశాలలోనే శిక్షణనిస్తుండగా కొన్ని పెద్ద సంస్థలు 50 అంశాలలో కూడా శిక్షణనిచ్చేవి ఉన్నాయి.

వివిధ రకాల ఆటలు, పాటలు, నాట్యం, పాశ్చాత్య డాన్సులు, కుట్లు, అల్లికలు, బొమ్మల తయారీ, పెయింటింగ్, క్రీడలు ఇలా





పలు అంశాలలో శిక్షణనిస్తారు. స్థూలంగా వీటిని వర్గీకరిస్తే హాబీలు, వృత్తులు, క్రీడలు, అలవాట్లు వంటి సబ్జెక్టులలో బాలలకు శిక్షణ లభిస్తుంది. ప్రతి ఒక్కరూ ఒకటి గానీ అంతకంటే ఎక్కువ గానీ అంశాల్లో వారి ఇష్టప్రకారం శిక్షణ పొందవచ్చు. ఈ విషయాల్లో వీరు పెద్దగా ప్రావీణ్యం సంపాదించలేక పోవచ్చు. కానీ వారికి ఆసక్తి ఉన్న విషయం గురించి పరిచయం, ప్రాథమిక పరిజ్ఞానం, కొంతవరకు ప్రావీణ్యం సంపాదించ గలుగుతారు.

ఆర్థికాంశం : సగటున 45 రోజుల పాటు జరిగే ఒక్క శిబిరానికి నిర్వహిస్తున్న సంస్థ స్థాయి, క్రీడాంశం ఆధారంగా ఫీజులు ఉంటాయి. హైదరాబాద్‌లోని జవహర్ బాలభవన్ కేవలం 12 రూపాయిలే రుసుమును తీసుకుంటోంది. ఎంసిహెచ్ కూడా నామమాత్రపు ఫీజుతోనే శిక్షణ ఇస్తూ శిబిరం పూర్తయిన అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా ఇస్తోంది. జవహర్ బాలభవన్ పబ్లిక్ గార్డెన్స్‌లోని తన విశాలమైన ఆవరణలో శిక్షణ ఇస్తుండగా, ఎంసిహెచ్ నగరంలోని అన్ని పాఠశాలల గ్రౌండ్‌లను శిక్షణా శిబిరాలుగా మారుస్తోంది. ఎక్కడికక్కడ స్థానికంగా ఏదో ఒక క్రీడాంశంపై బాలలకు శిక్షణ ఏర్పాటు చేస్తోంది. వ్యాపార దృక్పథంతో నడిచే కొన్ని ప్రయివేటు సంస్థలు రు.1500 నుంచీ 2500ల వరకూ ఫీజు వసూలు చేస్తున్నాయి.

ఎంపిక చేయండిలా! : వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణను లాభసాటి వ్యాపారంగా కొన్ని సంస్థలు పరిగణిస్తున్నాయి. చిన్నారులకు చక్కటి శిక్షణనిచ్చి వారి అభ్యున్నతికి బాటలు వేయాలనే సంకల్పంతో పనిచేసే సంస్థలు ఉన్నట్టే... చిన్నారుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు పిండే ఫక్తు వ్యాపార సంస్థలు కూడా ఉన్నాయి. కాబట్టి తమ పిల్లలను శిక్షణకు చేర్పించే ముందు ఎన్నో

ఉపయోగాలు

ఇంతకీ వేసవి శిక్షణా శిబిరాలకు పిల్లలను పంపించడం వలన కలిగే ప్రయోజనం ఏమిటి? అంటే చాలా ఉపయోగముందని చెప్పాలి. ఆసక్తి ఉన్న అంశంలో శిక్షణ అనేది కచ్చితంగా ఉండాలి. అప్పుడే వారు సరయిన దారిలో కృషిచేసి ప్రావీణ్యం సంపాదించగలుగుతారు. ఆ మార్గదర్శకత్వం వారికి చిన్న వయస్సులోనే ఇక్కడ లభిస్తుండడం ముదావహంగానే భావించాలి.

- ✔ కొంతమంది పిల్లలు ఎవరితోనూ కలవరు. ఎప్పుడూ మూడీగా, ఏదో పోగొట్టుకున్న వారిలా ఉంటారు. ఇలాంటి పిల్లలకు మంచి 'మూడ్'ను ఇవ్వడానికి ఈ శిబిరాలు దోహదపడతాయి.
- ✔ పాఠశాలల్లో ఉండే రొటీన్ వాతావరణం ఇక్కడ లేకపోవడం వలన వారి మేధ స్వేచ్ఛగా ఆలోచించి అద్భుతాలు చేయగలిగే విధంగా తయారవుతుంది. అంటే మేధో వికాసానికి ఇవి బాగా ఉపకరిస్తాయి.

- ✔ స్కూల్స్ పనిచేసే రోజుల్లో ఆట పాటలకు, కళా నైపుణ్యం ప్రదర్శించడానికి అవకాశం ఉండదు. కాబట్టి ఈ సెలవులు, శిబిరాలు ఉత్తమ అవకాశాన్ని కల్పిస్తున్నాయి. అలా ఇవి విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీసి సానబట్టే దిశగా ఉపకరిస్తాయి.
- ✔ ఇంటి వద్ద ఎవరికి వారే కూర్చుని ఆసక్తి ఉన్న అంశాలను ప్రాక్టీస్ చేసేకంటే ఇక్కడ నిపుణులు, అనుభవజ్ఞులు, కోచ్‌ల ఆధ్వర్యంలో ఎక్కువగా, సక్రమంగా నేర్చుకునే అవకాశముంది.
- ✔ సిగ్గు, బిడియం, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌ల వంటివి పోయే అవకాశాలున్నాయి.
- ✔ కొత్త స్నేహితుల పరిచయాల వలన భవిష్యత్తులో అవి ఎదుగుదలకు ఉపయోగపడతాయి.

అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వాటి ఆధారంగానే సరయిన నిర్ణయం తీసుకోగలుగుతారు. ఈ కింద తెలిపిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటే పిల్లలకు ఇష్టమైన వ్యాపకాన్ని నేర్పించిన వారవుతారు.

- మీ సమీపంలో ఎక్కడెక్కడ ఈ శిక్షణా శిబిరాలు జరుగుతాయో వాటి వివరాలు సేకరించండి.
- అందుబాటులో ఉన్న సంస్థలకు వెళ్ళి పరిశీలించండి.
- గతంలో ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకోండి. కోచింగ్, సౌకర్యాలు ఎలా ఉన్నాయో అడిగి చూడండి.
- శిబిరాలు మీకు దగ్గరలో ఉన్నాయా? దూరంలో ఉన్నాయా? అనే అంశాన్ని చూడకుండా కొద్దిగా దూరం అయినా సౌకర్యాలు, క్వాలిఫైడ్ కోచ్‌లు ఉన్న వాటికే ప్రాధాన్యం ఇవ్వండి. ఇవి లేని శిబిరాలు కాలక్షేప కేంద్రాలుగా తప్ప అన్యథా ఉపకరించవని గుర్తించండి.
- వేసవి శిక్షణా శిబిరాలను కూడా కొన్ని సంస్థలు భారీ వ్యాపారంగా మలచుకుంటున్నాయి. అందుకని ఇవి రంగు రంగుల బ్రోచర్లతో అట్టహాసంగా ప్రచారం చేస్తూ ఊదరగొడతాయి. వీటిని చూసి మోసపోకుండా జాగ్రత్త వహించండి. మీరు వాటిని స్వయంగా పరిశీలించి నిర్ణయం తీసుకోండి.
- ప్రారంభ సమయంలో వివిధ సంస్థలు అనేక వాగ్దానాలు చేస్తాయి. చివరలో పోటీలు నిర్వహించడం, శిక్షణలో మంచి ప్రతిభ కనబరిచిన వారికి మరింత ప్రోత్సాహాన్ని కల్పించడం, బహుమతులు ఇస్తామని చెబుతారు. గతంలో ఇలా ఇచ్చిన హామీలను ఈ సంస్థ నిలుపుకుందా అనే అంశాన్ని పరిశీలించడం ముఖ్యం.
- అనుభవం, నైపుణ్యం లేని వారిని అనర్హులను కూడా కొన్ని సంస్థలు కోచ్‌లుగా, శిక్షకులుగా నియమిస్తాయి. ఇలాంటి వాటి జోలికి వెళ్ళకండి.
- కొన్నిటిలో కనీస వసతులు కూడా ఉండవు. ఇరుకైన స్థలంలో కిక్కిరిసినట్లు పిల్లలను కూరుతారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండడం మంచిది.
- వేసవి శిక్షణ శిబిరాలలో పిల్లలను చేర్పించే ముందు గుర్తు పెట్టుకోవలసిన మరో ముఖ్యవిషయం... పిల్లల ఇష్టాలేమిటో తెలుసుకోవడం. వారు దేని మీద ఆసక్తి చూపుతున్నారో తెలుసుకుని ఆ అంశాల్లోనే శిక్షణ నిప్పించండి. పాఠశాలలను, కోర్సులను వారి మీద రుద్దినట్లు కాకుండా వారి ఇష్టాలకు ప్రాధాన్యతనివ్వండి.
- ఆయా శిబిరాల నిర్వాహకుల చిత్తశుద్ధి, క్రమశిక్షణకు వారు ఇచ్చే ప్రాధాన్యత, ఆహ్లాదకర వాతావరణం, కోచ్‌ల ప్రవర్తన మీద వారు నేర్చుకునే, ప్రావీణ్యం సంపాదించడం ఆధార పడుతుంది. అందుకని మంచి సంస్థను ఎంచుకోవడమే అత్యంత ప్రాధాన్యత గలిగిన విషయం. ★

✔ నలుగురితో కలిసి ఆటపాటల్లో పాల్గొనడం, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించడం వలన పోటీతత్వం పెరుగుతుంది. కొన్ని సార్లు ఓటమిని సైతం నిర్భయంగా స్వీకరించే 'క్రీడాస్ఫూర్తి' అలవడుతుంది.

✔ సెలవుల్లో రోజంతా పిల్లలు ఖాళీగా ఉంటారు. పెద్దలు ఎవరి పనుల్లో వారుంటారు. తల్లిదండ్రులు ఉద్యోగులైతే ఇక పిల్లలను కనిపెట్టే వారే ఉండరు. ఈ తరహా వాతావరణం పిల్లలను చెడగొట్టవచ్చు. క్రమశిక్షణ దెబ్బతింటుంది. వేళలు గతి తప్పుతాయి. సోమరితనమూ అలవాటు కావచ్చు. ఎండలో తిరిగితే వడదెబ్బ తగలవచ్చు. వేసవి శిబిరాలలో చేర్పడం వలన వీటన్నింటినీ తప్పించవచ్చు.

✔ ఖాళీగా ఉంటూ ఇరుగుపొరుగు పిల్లలతో గొడవలు పెట్టుకుంటూ తగాదాలు, తలవంపులు తెచ్చే బాధకూడా తొలగిపోతుంది.

✔ రోజులో ఎక్కువ కాలం టీవీకి అతుక్కుపోయి, తలనొప్పులు, కళ్ళద్దాలు తెచ్చుకోవడం దానికి అలవాటు అయ్యే ప్రమాదం నుంచి కూడా ఈ శిబిరాలు మీ పిల్లలను రక్షిస్తాయి.

✔ అన్నిటికీ మించి మెదడుకు, మేనికి చక్కటి వ్యాయామం కల్పిస్తాయి.

✔ వేసవి సెలవులను ఆసక్తి ఉన్న అంశాలు నేర్చుకొంటూ సరదాగా గడిపామనే తృప్తి పిల్లల్లో కలుగుతుంది. దానితో తిరిగి పాఠశాలలకు ఇనుమడించిన ఉత్సాహంతో వెళ్ళగలుగుతారు.

✔ పూర్తి వేసవి కాలాన్ని, సమయాన్ని పిల్లలచే సద్వినియోగం చేయించగలిగామన్న తృప్తి పెద్దలకు కలుగుతుంది.

కథ

ఒక వూరి కథ....

వి.శాంతిప్రబోధ

(గత వారం తరువాయి)



మా ఇంటినుంచి మరో రెండు ఇళ్ళు దాటితే కాలువకు దారి. ఇంకాస్త ముందుకెళ్తే దళితుల ఇళ్ళు.... ఆపైన నాయకపోడ్ గిరిజనుల ఇళ్ళు... దళితవాడకు కొద్దిగా ఇవతలే వడ్రంగి రామాచారి. అతని భార్య అంతమ్మల ఇల్లు... ఊర్లో పెద్ద మార్పేమీ కన్పించలా.. అలా తిరిగి వస్తూ, నిన్ను ఓ ఇంటికి తీసుకెళ్తాను. కానీ నీవక్కడ ఏం మాట్లాడవద్దు. మౌనంగా ఉండాలి సరేనా అంటే సరేనన్నాడు వివేక్. రామాచారి-అంతమ్మల ఇంటికి బయలుదేరాం. నవమాసాలు మోసిన తల్లి పురిట్లోనే దూరమైతే తన కొడుక్కి ఇచ్చే స్తన్యం నాకు పంచి ఇచ్చి నన్ను కాపాడిన తల్లి అంతమ్మ" అని దార్లో వివేక్‌కి చెప్పాను. వాకిట్లోనే ప్లాస్టిక్ నులకమంచంలో పిట్టలాగా ఒదిగిపోయిన అంతమ్మను సులభంగానే పోల్చుకున్నా.

"అంతమ్మా బాగున్నావా?" అంటూ వెళ్ళి ఆమె పక్కన కూర్చొని ఎముకల గూడులాంటి ఆమె చేయి పట్టుకున్నాను అభిమానంతో.

"ఎవరూ... చిన్న బాబా... బుల్లెబ్బాయ్ బాబా.. ఎంతకాలమయింది బాబూ" ఆప్యాయంగా ఆమె చేతులతో నన్ను తడుముతోంది.

ఆమెకు చూపుపోయిందని అర్థమయింది.

"చూపులేకపోయినా ఎట్లా గుర్తుపట్టావ్ అంతమ్మా" ఆశ్చర్యంగా అడిగా.

"బాబూ నువ్వుగాక ఇంకెవరు బాబూ అంతమ్మా అంటూ నోరారా అభిమానంతో పిలిచేది" లేచి కూర్చోబోయింది.

"అబ్బా..." అంటూ మళ్ళీ మంచంపై వాలిపోయింది.

"ఏమైంది అంతమ్మా"

"ఏం లేదులే బాబూ... నడుం నొప్పి... వయసు అయిపోయింది కదా..." అంటూ బాధను బిగబట్టి నవ్వింది.

"బాబూ, ఎన్నాళ్ళయ్యింది వచ్చి" అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

అంతమ్మ ఇల్లు చిన్న చిన్న మార్పులతో వాకిట్లోకి అడుగు పెట్టగానే కన్పించే రామాచారి, అతని వడ్రంగి సామాను కన్పించడం లేదు... అంటే రామాచారి..? అంతమ్మవైపు చూశాను. అర్థరూపాయి బిళ్ళంత ఉండాల్సిన కుంకుమ బొట్టు లేకుండా బోసి నుదురు...

అంతలో ఓ పడుచు లోనకెళ్ళి వచ్చి కుండలో నీళ్ళతో కాళ్ళు కడుక్కుంటూ..

"ఎవరే, లక్ష్మి నువ్వేనా...? ఈ బాబును చూశావా...?" అంటూ నన్ను పరిచయం చేసింది కోడలకి. సెల్‌ఫోన్ ఇచ్చారా... వాకబు చేసింది.

"లేదత్తా హైదరాబాద్ మీటింగుకి పోయివచ్చినంక ఇస్తారంట. ముందు మీటింగుకు గ్రూపులో వాళ్ళను జమెయ్యాలి" చెప్పింది లక్ష్మి.

వారి సంభాషణ అర్థం కాని నేను ఆ ఇంటి పరిసరాల్ని గమనిస్తూ ఉండిపోయాను.

"ఇది డ్వాక్రా గ్రూపులీడరు కద, సెల్‌ఫోను ఇస్తారంటే పోయొచ్చింది. దీపం పథకంలో గ్యాస్‌బండ ఇచ్చారు. ఇప్పుడు సెల్‌ఫోను అంటున్నారు. గ్యాస్ బండ ఇచ్చింది తప్ప మళ్ళీ మేం కొనలేదు. ఆ గుట్టకుపోయి ఆ పుల్ల ఈ పుల్ల ఏరుకొచ్చి పొయ్యిలో పెట్టుకొనే మేం ప్రతిసారీ లక్సెట్టిపేటకు పోయి 300 రూపాయలు పెట్టి బండకొనగలమా...? మూలకు పడేసినాం. ఇప్పుడు ఫోనట. ఫోను ఇస్తారు సరే, దాని బిల్లులు ఎవరు కట్టాలె. జమెయ్యడానికి పనులే లేకపోయె అంటే... తీసుకున్న అప్పు తీర్చేది ఎట్లా అని బాధ అవుతాంటే పైసలు పెట్టుకోని ఆ మీటింగు, ఈ మీటింగ్ అని తిరుగుడు. పని దండుగ... ఏ మీటింగైనా, ఎవరొచ్చినా డ్వాక్రా గ్రూపులే కావాల... విసుక్కుంది అంతమ్మ.

'పెద్దపెద్ద వాళ్ళ చేతుల్లో ఉండే సెల్‌ఫోన్ మాకు వస్తుందంటే ఆశ ఉండదా...' అంటూ సాయంకాలపు పనిలో పడింది లక్ష్మి.

'అంతమ్మా లేవలేకుండా ఉన్నావు. అలా మంచంలో పడి ఉండేబదులు హాస్పిటల్‌కు వెళ్ళి చూపించుకోకపోయావా..?" అడిగాక అనాలోచిత ప్రశ్న అన్పించింది.

"లక్సెట్టిపేట ప్రభుత్వాసుపత్రిలో చూపించుకున్నాను. ఆ డాక్టరు అప్పటికి మందులిచ్చి చీటిరాసిచ్చాడు. ఇంటి దగ్గరికి వచ్చి వైద్యం చేయించుకోమన్నాడు. అంత ఖర్చు వేం భరించగలమా...? చేతిలో పైసలుంటే ఈ ప్రభుత్వాసుపత్రి చుట్టూ ఎందుకు తిరగడం అని మానేశాను. ఎవరికి తోచినట్లు వాడు ఈ పేదోళ్ళను దోచుకోవడమే. ఈ లోకంలో పేదోళ్ళుగా పుట్టడమే పాపం అయిపోయింది. బతుకు భారమైపోయింది" వాపోయింది అంతమ్మ.

అంతలో 'ఊగుతూ... తూగుతూ.. ఏదో ప్రేలాపనతో వచ్చాడు... అతను బహుశా లక్ష్మణ్ అయి ఉండొచ్చు.. ఆ... అవును... అతను లక్ష్మణే.. అతని ముఖం మీద వున్న గాటు చెప్తోందా విషయం.

"ఏం లక్ష్మణ్... బాగున్నావా? ఏం చేస్తున్నావ్..?" ఆదరంగా పలుకరించాను. "ఎవడ్రా... నువ్వు ఎవడ్రా.." అంటూ మీద మీదకు వచ్చాడు.

"వాడా... ముప్పొద్దులా కల్లు, సారా తాగడం, చీట్లపేక ఆడడం, పెళ్ళాన్ని నాలుగు తన్ని పైసలేమన్నా రాల్తే పట్టుకుపోవడం... ఏమీ లేకపోతే ఇంట్లో సామాను ఏది అందితే అది పట్టుకుపోయి అమ్ముకోవడం.. అది బాబూ వాడు చేసే భాగోతం" అంది బాధతో అంతమ్మ.

"ఏయ్ ముసల్దానా ఏంటే వాగుతున్నావు...? నా ఇష్టం... తాగుత... తందనాలాడ్తా... నీవిచ్చావా...? నీ అబ్బిచ్చాడా... పైసలు" అంటూ అంతమ్మ మీదకు రావడంతో లక్ష్మి అతన్ని ఈవలకు లాగింది.

"అరె... లం...డా" అంటూ ఆమె మీదకు కర్రతో లంకించుకున్నాడు. ఆ అరుపులకు పొగడ చెట్టు మీద చేరిన పక్షులు ఎగిరిపోయాయి.

"ఆ... మాజీ ఎమ్మెల్యే దయగలోడు కాబట్టి, పెట్టెలకు పెట్టెలు పగలు రాత్రి లేకుండా పోయిస్తున్నాడు. ఎంత కావాలంటే అంత తాగండ్రా అని పోయిస్తున్నాడు" అంటూ మా పక్కన నిలబడ్డాడు.

'ధూ... సిగ్గులేదు. నీకు బుద్ధిరాదు. అంతో ఇంతో పొలం వున్న వాళ్ళకు బియ్యం కార్డు ఇచ్చి ఏం లేని మనకు ఇవ్వలేదేమని నిలదీసినందుకు నీ కన్న తల్లిని నానా బూతులు తిట్టి, ఏం ముసల్దానా ఒళ్ళు బలిసిందా అంటూ ఒక్క తోపు తోసి ఆమె నడుం విరగ్గొట్టించిన వాడు నీకు మంచోడు అయిపోయాడా! అవున్లే ఓట్ల పండుగ దగ్గర పడ్తాంది కదా.... నీలాంటి తాగుబోతులకు కావాల్సినంత తాగ బోపిచ్చి, తినిపిచ్చి మేపుతారు ఆబోతుల్లా... మీ అవసరం తీరగానే మీరెవరో... ఆడెవరో... ఎలక్షన్లు ఎప్పుడొచ్చినా జరిగేది ఇదే కదా" ఈసడించుకుంది లక్ష్మి.

ఇక అక్కడ ఉండడం మంచిది కాదని తెచ్చిన బహుమతులు అందించి, అంతమ్మా నేను ఉండగా నీకు వైద్యం చేయించాలనుకుంటున్నానని చెప్పి బయలుదేరుతున్న మమ్మల్ని 'చల్లగా బతకాలి' అంటూ దీవించిందామె.

లక్ష్మణ్ ప్రవర్తనతో బిక్కమొహం వేసి

చూస్తున్న వివేక్ "నాన్నా కాసేపు ఆ బ్రిడ్జిపై కూర్చుందామా..." అనడంతో అటు బయలుదేరాం.

దుమ్ము రేపుకుంటూ ఇళ్ళకు చేరుతున్న పశువులు... దారంతా దుమ్ము... ధూళితో ఆకాశంకేసి ఎగుస్తూ... అవి పేడ వేస్తుంటే కొందరు గంపల్లోకి ఎత్తుతూ... కొందరు గంపలు పట్టూ.... రోడ్డు పక్కలకు వెళ్తున్న వాటిని అదిలిస్తూ... వెనుకబడిపోతున్న దూడల్ని ముందుకు తోలుతూ ఆకాశంలో పక్షులు బారులు తీరి గూటికి చేరుకుంటూ... కాలువ నీటి మీదుగా వచ్చే చల్లని గాలీ... చాలా గమ్మత్తుగా ఉంది వివేక్‌కి.

"ఛీ... ఛీ... వీళ్ళేంటినాన్నా ఆనిమల్ డంగ్ చేత్తో పట్టుకుంటున్నారు?" అన్నాడు చీదరగా మొహం పెట్టి.

"పశువులు లేని వాళ్ళు దాన్ని కళ్ళాపి చల్లడం కోసం తీసుకెళ్తున్నారు. కొందరు పిడకల కోసం పేడ ఏరుకెళ్తారు..."

"అసలు నాకేమీ అర్థం కాలేదు... కళ్ళాపి... పిడకలు...." మొహం ఏదోలా పెట్టిన వివేక్.

"నీళ్ళు, పేడ కలిపి వాకిట్లో చల్లుతారు. దాన్నే కళ్ళాపి అంటారు. వాకిలి శుభ్రంగా ఉంటుందని అలా చల్లుతారు. పేడలో ఊక, బూడిద కలిపి గుండ్రంగా కేకుల్లా చేస్తారు. ఎండపెడ్తారు. వాటిని ఫ్యూయల్‌గా వాడతారు. మీ నాన్నమ్మ కూడా పేడతో తయారైన గ్యాస్‌తోనే వంట చేసింది" వివరంగా చెప్పాను. అందుకనే ఇక్కడ పేడను ఎవరూ అసహ్యించుకోరు. అది అందరికీ అవసరమైనది.

"ఏంటో... అన్నీ స్ట్రేంజ్ థింగ్స్..." వివేక్.

"నాన్నా.. ఆ అంతమ్మ వాళ్ళ ఫ్యామిలీ ఏంటీ... మ్యానర్స్ లేకుండా పోట్లాడుకుంటున్నారు? అతను తాగుబోతా?"

"చిన్నప్పుడు బాగుండేవాడు. ఇప్పుడెందుకు అలా మారిపోయాడో...?"

"చిన్నప్పటి నుండి అతను నీకు బాగా తెలుసా...?"

"అవును, అతను నా చిన్ననాటి మిత్రుడు. నాకంటే ఒక నెలో లేక రెండు నెలలో పెద్దవాడు. చిన్నప్పుడు లేగ దూడల్తో ఇద్దరం కలిసి ఆడుకునే వాళ్ళం. నాల్గవ తరగతి వరకూ మా ఊరి బడిలో కలిసి చదువుకున్నాం. ఆ తర్వాత లక్ష్మణ్ పని చేయడం మొదలు పెట్టాడు. నేను దండేపల్లిలో బడికి వెళ్ళేవాడిని..."

"అంత చిన్నప్పుడే పనిచేసేవాడా...?"

"అవును, లక్ష్మణ్ వాళ్ళ నాన్న వడ్రంగం పని చేసేవాడు. అంటే వ్యవసాయ పనిముట్లు చేసేవాడు. అతనికి వచ్చే ఆదాయం కుటుంబానికి సరిపోయేది కాదు. ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయాలి. అందుకే లక్ష్మణ్‌ని పనిలో పెట్టాడు వాళ్ళనాన్న. ఆదివారం సెలవే కాబట్టి లక్ష్మణ్‌తో కలిసి నేనూ వెళ్ళేవాడిని మా నాన్నకి తెలియకుండా. మేం ఇద్దరం... దూరంగా కన్పిస్తుంది చూడు ఆ అడవికి వెళ్ళేవాళ్ళం.. ఉల్లెంత కాయలు, ఉడుగు కాయలు, తునికి పండ్లు, మొర్రిపండ్లు వెతికి తెచ్చుకు తినేవాళ్ళం. ఈత గుజ్జు కొట్టుకు తినేవాళ్ళం. వెళ్తూ... వెళ్తూ దార్లో ఉండే పెసరకాయలు, కందికాయలు, పచ్చికంకులు, జొన్నకంకులు తెంపుకుని తంపటి వేసుకుని కాల్చుకు తినేవాళ్ళం. అంతా థ్రిల్లింగ్... మధ్యాహ్నం లక్ష్మణ్ తెచ్చుకున్న అల్యూమినియం బాక్సులో ఏది వుంటే అది ఇద్దరం తినేవాళ్ళం. లక్ష్మణ్‌తో పాటు గేదెలు కాసే మరికొందరు పిల్లలందరం కలిసి కోతికొమ్మచ్చి ఆడేవాళ్ళం. కాలువలోనూ, వాగులోనూ ఈతకొట్టేవాళ్ళం. అవన్నీ మరచిపోలేని మధుర స్వప్నాలురా.." మరుగున పడిన ఆ జ్ఞాపకాలు అలలు అలలుగా ఉవ్వెత్తున ఎగుస్తుండగా "నేనేమైపోయానా అని మా నాన్న కంగారు పడడం, నేనింటికి రాగానే చింతబరిగెతో ఒళ్ళంతా వాతలు తేలేలా కొట్టడం.. ఇంకెప్పుడూ ఇట్లా చెయ్యను నాన్నా... ప్లీజ్... కొట్టొద్దు నాన్నా... నీకు దణ్ణం పెడ్తా నాన్నా... అంటూ ఆయన కాళ్లకు చుట్టుకుపోవడం... సెలవు వచ్చిందంటే మళ్ళీ చెప్పకుండా వెళ్ళడం షరా మామూలే... అవన్నీ కళ్ళకు కట్టినట్లు నాకింకా కన్పిస్తున్నాయి". "అమ్మో... మీ నాన్న పెద్ద శాడిస్టులా ఉన్నాడే...?" వివేక్ ప్రశ్న.

"కాదు... శాడిస్టు కాదు. ప్రేమమయుడు మా నాన్న. అయితే ఆ ప్రేమని వ్యక్తం చేయకూడదనుకొనే తత్వం ఆయనది. ప్రేమతోనే, నా మంచి కోరే నన్ను దండించే వారు. అలా అయితేనే వృద్ధిలోకి వస్తారు అనుకునే వారు. పిల్లలపై ప్రేమను వ్యక్తం చేస్తే పిల్లలు చెడిపోతారని అనుకునే మా నాన్నకి నేనంటే అమితమైన ప్రేమ. అయితే ఆ విషయాన్ని నా బుర్రకు అర్థమయ్యేలా ఆయన ఎప్పుడూ ప్రవర్తించకపోవడంతో నేనే ఆయన్ని అపార్థం చేసుకున్నాను. నెగెటివ్ ఆలోచనలు పెంచుకున్నాను. ఆయన ఏం చెప్పినా వ్యతిరేకించాను. ఆయనకు విరుద్ధంగా ప్రవర్తించాను. అందుక్కారణం మీ నాన్నమ్మ ఆనాటి ప్రవర్తన కూడా అయి ఉండొచ్చు.

అలగా జనం పాలు తాగి పెరిగిన వాడికి అలగా బుద్ధులు కాక మంచి బుద్ధులు వస్తాయా...? చదువూ సంధ్యారాని మొద్దురాచిప్ప... గుడ్డి గుర్రాల పళ్ళు తోముతాడ్లే.. అంటూ నా గురించి ఆవిడ ఎగతాళి మాటలు... నన్ను మరింత గాయపరచేవి. ఆ పాలేరు సచ్చినోడితో తిరిగి వాడి తల్లేదో వీడికి కన్న తల్లయినటు అంతమ్మా... అంతమ్మా అంటూ దాని కొంగుపట్టుకు తిరుగుతాడు అంటూ నన్ను ఈసడించుకునేది. నన్ను ఎంతో అభిమానించే అంతమ్మను, నా మిత్రుడు లక్ష్మణ్‌ని అవమానపరచడం నాకు నచ్చేది కాదు. మొదట్లో ఆవిడతో వాదన పెట్టుకొనే వాడిని. ఎదురు మాట్లాడేవాడిని. ఆమె నన్ను మాటలతో హింసించడమే కాక నాన్న రాగానే నా మీద చాడీలు చెప్పేది. ఛీ... ఛీ... నాన్న ఎందుకు చేసుకున్నాడో ఈ దెయ్యాన్ని... మహారాక్షసిని అంటూ కసితీరా తిట్టుకునే వాడిని. తల్లిలేని పిల్లవాడినని నన్ను ప్రేమించి లాలించాల్సిన అమ్మ నన్నూ, నా మనసునూ ఎప్పుడూ గాయపరిచేది తట్టుకోలేకపోయేవాడిని. నేను పుట్టినప్పుడే అమ్మమ్మ వాళ్ళతో నాన్నకు మాట పట్టింపులు వచ్చాయట. వాళ్ళు ఎలా ఉంటారో నాకు తెలీదు. నాన్నకి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఎవరూ లేరు. నాకూ ఎవరూ లేరు... నాకు సంతోషమొచ్చినా, దుఃఖమొచ్చినా లక్ష్మణ్‌తోనే పంచుకునే వాడిని,. రోజురోజుకీ విపరీతంగా ద్వేషం పెంచుకుంటున్న నన్ను చూస్తే నాన్నలో ఎక్కడలేని ఆందోళన. ఇంక లాభం లేదని 10వ తరగతి కాగానే గుంటూరులో హాస్టల్‌లో చేర్పించారు. బందిఖానాలాగా ఉండే హాస్టల్ అంటే నాకసలు ఇష్టం లేదు. లక్సెట్టిపేట కాలేజీలో చేరతానంటే ఒప్పుకోలేదు మా నాన్న. పోనీలే... రోజూ ఈవిడ బాధ తప్పుతుందనే ఏకైక కారణంతో గుంటూరులో ఉన్నాను. అయితే నా మనసంతా మన ఊరిపైనే, నా మిత్రులపైనే, అక్కడ ఏదో జైలు గోడల మధ్య ఉన్న ఫీలింగ్. కానీ తప్పదు. సెలవులకు ఇంటికొచ్చినప్పుడు స్వేచ్ఛా విహంగంలా అన్పించేది. ఇంటి దగ్గర అసలు ఉండేవాడిని కాదు. "నాన్నా... నాన్నమ్మ మన మీద చాలా ప్రేమ చూపిస్తోంది కదా...!" అన్నాడు సందేహంగా వివేక్. నా పట్ల ఆవిడ ప్రవర్తనకి ఇప్పుడామె చాలా బాధపడ్తోందట. నా తల్లిదండ్రుల పట్ల నా ప్రవర్తనకి నేనూ సిగ్గుపడుతున్నాను..." గొంతు మూగపోతుండగా అన్నాను.

"బుల్లెబ్బాయ్... ఇక్కడున్నారా...? ఇంకా ఇంటికి రాలేదని మీ అమ్మ ఎదురు చూస్తోంది" మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చిన మావయ్య.

"తాతయ్యా... మా నాన్న ఏమన్నా చిన్నపిల్లాడా...! ఇంకా రాలేదని వెతుక్కుంటూ వచ్చారు?" అన్నాడు నవ్వుతూ వివేక్.

"ఒరే... నాకు తెలీకడుగుతా... అమెరికాలో పుట్టి పెరిగిన వాడు స్వచ్ఛమైన తెలుగు మాట్లాడడం, నాన్నా, తాతయ్యా అంటూ పిలవడం ఆశ్చర్యంగాఉందే..." అన్నాడు ఇక్కడి పిల్లలు మమ్మీ, డాడీ పిలుపులు వింటున్న మామయ్య.

"తాతయ్యా నేనెక్కడున్నా ఈ ఊరి మనవడినే కదా... అందుకే మా నాన్న నాకు మాతృభాషపై మాతృదేశంపై మమకారం నేర్పారు."

"ఘటికుడివేరా..." అన్నాడు మెచ్చుకోలుగా మామయ్య.

చిరుచీకట్లు కమ్ముకుంటున్నాయి. దారివెంట దోమలు బయ్యిమని ముసురుతున్నాయి. నడుస్తుంటే ముఖం చుట్టూ చికాకు కల్గిస్తూ... అంతలో మినుకు మినుకుమంటూ వీధి దీపాలు వెలిగాయి.

"మామయ్యా నేను వచ్చినప్పటి నుండి చూస్తున్నా... మన ఎదురింట్లో సందడే లేదు. దొడ్డినిండా పాడి పశువులు, ఇంటిముందు ధాన్యపు సిరులు, పండ్ల కూరగాయల మొక్కలతో కళకళలాడే ఇల్లు. ఎప్పుడూ పొలం తప్ప మరో ధ్యాసలేని బాబాయి, అతనితోడితే లోకం అనుకునే సీతమ్మ పిన్నీ.. ఎవరూ కన్పించరేం...?"

"ఇంకెక్కడి బాబాయి నాయనా... ఈ కుళ్ళిపోయిన కల్తీ లోకంలో ఇక ఉండలేనంటూ వెళ్ళిపోయారు" కళ్ళొత్తుకుంటూ అంది అమ్మ.

"వరుసగా వ్యవసాయంలో నష్టాలు, విత్తనాలు కల్తీ, పురుగు మందులు కల్తీ, ఎరువులు కల్తీ... ఇక రైతు ఎట్లా ఎదిగొస్తాడు. రాత్రింబవళ్ళు కష్టపడి రక్తాన్ని చెమటగా మార్చినా లాభం సంగతేమోగానీ పెట్టిన పెట్టుబడి చేతికిరాని పరిస్థితి. అయినా బతుకుమీద ఆశచావక, భూమితల్లిమీద నమ్మకం పోక ఈ ఏడాదైనా పంట చేతికి అందకపోతుందా...? తమ కష్టాలు తీరకపోతాయా...? అని మినుకుమినుకుమనే ఆశతో పంటవేయడం... అది చేతికి అందకపోవడం, అందినా గిట్టుబాటు ధర లేకపోవడంతో ఒకనాడు సిరులు పండించిన రైతు ఈనాడు బక్కచిక్కిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయి, కుటుంబాన్ని పోషించలేక, ఎదిగొచ్చిన పిల్లల పెళ్ళిళ్ళు చేయలేక

(మిగతా 15వ పేజీలో)



సాంస్కృతిక బంధం!

ముదిగంటి సుజాతారెడ్డి

అలిత ఇంట్లో అడుగుపెట్టూనే "ష్! వేడి! అప్పుడే ఎండలు ముదిరిపోతున్నాయి" అంది ఫ్యాన్ కింద సోఫాలో కూర్చుంటూ. "ఆఁ-అంతటా వేడివేడిగానే వుంది!... ఒకవైపు ఎన్నికలు! ఇంకోవైపు భారత్‌పాక్‌ల క్రికెట్ మ్యాచ్‌లు! మరోవైపు పిల్లల పరీక్షలు!..." అన్నాన్నేను.

"అవును సుశ్మీ! పిల్లలకు క్రికెట్ మ్యాచ్‌లు చూడాలా! పరీక్షల కోసం చదువుక్కోవాలా! పెద్ద టెన్షన్‌గా మారింది. అప్పుడప్పుడు కరెంటు కోతలు! ఇన్నిటితో వేగడం విద్యార్థులకు కష్టంగానే వుందనుకో! అయినా ఈసారి క్రికెట్ మ్యాచ్‌లు మా పసందుగా వున్నాయి! భారత్ పాక్‌ల క్రికెట్ అంటే ఎప్పుడూ వుండే పోటీల వైరం కన్పించటం లేదు. మంచి స్పోర్టివ్ స్పిరిట్‌తోనే ఆడుతున్నారు. అది చాలా సంతోషించతగ్గ విషయం!" "వైరం... పగ... ప్రతీకారాలు ఈసారి భారత్ పాక్ క్రికెట్ ఆటల్లో చోటు చేసుకోకపోవటం అందరికీ ఆనందంగానే వుంది లల్లీ! అందరూ క్రికెటర్ల ఆటను, వాళ్ళ నైపుణ్యాన్ని చూసి పూర్తిగా ఆనందిస్తున్నారు. రెండు జట్టుల్లో ఎవరు బ్యాటింగు, బౌలింగు జోరు చూపినా చప్పట్లు చరుస్తున్నారు. ఆనందంతో అభినందిస్తున్నారు. అందులో అనుకోకుండా భారత్ జట్టు బాగా ఆడటం అందర్నీ ఆశ్చర్యముగ్ధులను చేస్తూ వుంది. వన్‌డే సిరీస్‌లో భారత్ గెలవటం భారతీయుల్ని ఆనందపరిచింది. అందులో ఆశ్చర్యమేమీ లేదు. కాని పాకిస్తానీయులు కూడా ఆనందంతో సంబరం చేసుకోవటం విశేషంగా చెప్పుకోవాలి!" అన్నాన్నేను ఆనందంగా. "అంతే సుశ్మీ! ఎప్పుడైనా భారత్ పాకిస్తాన్ దేశవాసుల్లో ఎటువంటి వైరం లేదు. రాజకీయాలే పగలను, ప్రతీకారాలను సృష్టిస్తూ వుంటాయి. సామాన్య జనుల్లో ఏ కోపతాపాల్లేవు. అంతెందుకు మొన్న మా చిన్నాన్న అమెరికా నుంచి వచ్చాడు కద!... అక్కడ భారతీయులు, పాకిస్తానీయులు చాలా స్నేహంగా వుంటారట! ఒకరింటికి ఒకరు వెళ్ళటం, సహాయం చేసుకోవటం వుంటుందట. అసలక్కడ భారతీయులకు పాకిస్తానీయులకు మధ్య వున్నంత స్నేహం మరే దేశం వాళ్ళతో వుండదట!" అంది లలిత.

"అవునే లల్లీ! పాకిస్తానీయులు మతం పేరుతో చూస్తే వాళ్ళు పశ్చిమ దిశగా వున్న పొరుగు దేశాలకు దగ్గరగా వున్నారు. కాని సాంస్కృతికంగా వాళ్ళకు ఆ దేశాలతో ఆత్మీయత లేదు. భారతీయులే వాళ్ళకు భాషలోగాని, సాంస్కృతికంగా గాని దగ్గరైన వాళ్ళు. అందుకే ప్రపంచంలో ఎక్కడ కలుసుకున్నా వాళ్ళు పరస్పరం ఏ బేధభావం లేకుండా స్నేహంగా వుంటారు" అన్నాన్నేను.

"నువ్వన్నది నిజమే సుశ్మీ! చారిత్రకంగా భౌగోళికంగా వాళ్ళు మనకు దగ్గరి వాళ్ళు! వాళ్ళూ మనమూ ఒక్కటే జాతి కద! వాళ్ళ రాజభాష ఉర్దూ, ఇంకా సింధీ, పంజాబీ భాషలు కూడా భారతదేశంలోనూ వున్నాయి. ఆ విధంగా భాషా విషయంలోనూ వాళ్ళు మనకు చాలా దగ్గరి వాళ్ళు!" అంది లలిత.

"లల్లీ! దీన్ని బట్టే తెలుస్తుంది... మతం ఎప్పుడూ విభేదాలను సృష్టించదు అని. భారతీయుల, పాకిస్తానీయుల మతం ప్రధానంగా చూస్తే వేరే అయినా భాష, సాంస్కృతికంగా వాళ్ళు చాలా దగ్గరి వాళ్ళు. భారత్, పాక్‌లు వేరై అర్థ శతాబ్దం దాటినా తరాలు మాత్రం మలిగిపోవటం లేదు!" అన్నాన్నేను.

"అంతేకాదు సుశ్మీ! మన టీవీ సీరియళ్ళు అక్కడ చాలా పాపులర్ అయ్యాయట. ఇక ఇక్కడి సినిమాలు సినీతారలు సినిమా పాటలు... అంటే పడిచస్తారంట. మన క్యాసెట్లు బోలెడు అక్కడ దొరుకుతాయట" అంది లలిత కొంచెం ఆవేశంగా.

"అవును లల్లీ! ప్రభుత్వాలు ఎన్ని ఆంక్షలు పెట్టినా భారత్ టీవీ చానెళ్ళు చూడటం, సినిమాలు చూడటం అక్కడ ఆపటం కష్టమట. సాంస్కృతికంగా రెండు దేశాల ప్రజలకున్న సంబంధాలను, ఇష్టాలను ఏ దుష్ట రాజకీయాలూ చెరిపేయలేవు మరి! భారత్, పాక్‌ల మధ్య క్రికెట్ ఆటలు జరుగుతుంటే ప్రేక్షకుల్లో యువత భారత్, పాక్‌ల రెండు జెండాలను ఒక్కచోట చేర్చి పట్టుకొని ఊపటం చూడటానికి చాలా ఆనందమనిపించింది అందరికీ!" చిరునవ్వుతో లలిత వైపు చూస్తూ అన్నాన్నేను.

"అవును సుశ్మీ! ఆడ, మగ భేదం లేకుండా అందరిలో కన్పించిన సుహృద్భావం నిజంగానే ఆనందం కలిగించింది" అంది లలిత నామాటనంగీకరిస్తూ. ★

జింక చేసిన త్యాగం

పుప్పాల కృష్ణమూర్తి

ఓ ఉదయాన్నే జింక ఒకటి అడవి మొదట్లో పచ్చిక మేస్తోంది. మేత తింటూ శత్రువులెవరైనా వస్తున్నారేమోనని చుట్టూ చూడసాగింది. తన పెద్ద పెద్ద కళ్లను ఆర్పుకుంటూ బెదురుబెదురుగా పచ్చిక తింటున్న జింక ఎంతో అందంగా వుంది. పొద్దున్నే కావడంతో అది ఎంతో చలాకీగా వుంది. అప్పుడప్పుడు చెంగుచెంగున గెంతుతోంది. అంతలో దూరం నుండి ఒక వేటగాడు వల భుజాన వేసుకుని నాలుగు కుక్కలతో తనవైపే వస్తూ కనిపించాడు.

అంతే. దానికి గుండె ఆగినంత పనైంది. అప్పటివరకు ఎంతో సంతోషంగా వున్న జింక ఒక్కసారి దిగులుపడిపోయింది. కానీ అంతలోనే ధైర్యం తెచ్చుకుని పరుగందుకుంది. అలా వెళుతూనే "నేస్తాలూ... వింటున్నారా? నేను జింకను. వేటగాడు కుక్కలతో వస్తున్నాడు. దూరంగా పారిపోండి. మీ పిల్లలను, ముసలివాళ్లను జాగ్రత్తచేసుకోండి. మిత్రులారా! జాగ్రత్త' అని అరుస్తూ అడవంతా పరిగెత్తింది. దాని పిలుపుతో అప్రమత్తమైన జంతువులు కొన్ని దూరంగా పారిపోగా, మరికొన్ని ఎవరికీ కానరాకుండా నక్కాయి. జింక మాత్రం అడవంతా పరిగెత్తుతూ అరుస్తూనే వుంది.

దాని మాటలు, అది చేసిన హెచ్చరిక విన్న జంతువులు అన్నీ జాగ్రత్తపడ్డాయి. తమ చిన్నారి పిల్లలను, తమ ప్రియమైన ముసలివారిని జాగ్రత్త చేశాయి. కానీ పాపం జింకకే ప్రమాదం జరిగింది. అలా వేగంగా పరిగెత్తుతున్నప్పుడు ముందు కాళ్లకు దూసేరు తీగ తగిలి కిందపడింది. అలా పడడంతోనే ముందు కాళ్లు రెండూ పెద్ద బండరాయిని కొట్టుకుని విరిగిపోయాయి. బాధతో పెద్దగా అరిచింది జింక. ఇంక పైకి లేవలేకపోయింది. దగ్గర్లో దానికి ఒక్క జంతువూ కనపడలేదు. అన్నీ భద్రమైన ప్రదేశానికి వెళ్లిపోయాయి. బాధతో మూలుగుతూ అలాగే పడివుంది జింక.

వేటగాడు అడవిలో చాలాదూరం తిరిగాడు. అతనికి ఒక్క జంతువు కూడా కనపడలేదు. అలా వెతుక్కుంటూ జింక పడిపోయిన చోటుకు వచ్చాడు. కాళ్లు విరిగి లేవలేని స్థితిలో వున్న జింకను చూసి హై! నన్ను మొదట చూసి పరిగెత్తిన జింక ఇదే. అందరినీ వేటగాడు వస్తున్నాడంటూ హెచ్చరించిన జింక ఇదే' అని గుర్తుపట్టాడు.

దాని పక్కనే కూర్చుని, "జింకా! అలా పరిగెత్తడం వలన నీకేం లాభం వచ్చింది చెప్పు? నన్ను చూసి మీ జంతువులన్నిటినీ హెచ్చరించావు. అవన్నీ నాకు అందకుండా పోయాయి. సురక్షితంగా వున్నాయి. వాటికి జాగ్రత్త చెప్పిన నువ్వు కిందపడితే ఒక్క జంతువైనా నీ వైపు కన్నెత్తి చూసిందా? నిన్ను ఆపదలో ఆదుకోలేని జంతువులను నువ్వు కాపాడటమెందుకు?" అనడిగాడు వేటగాడు.

అప్పుడు జింక ఎంతో సంతోషంగా "నన్ను నా వాళ్లు చూడలేదు. లేకుంటే నీకు దక్కకుండా ఎత్తుకుపోయేవాళ్లు. నేనెలాగూ చనిపోవడం ఖాయం. అలా పోతున్నందుకు బాధలేదు. నా వల్ల మా జంతువులు సురక్షితంగా వున్నాయి. ఇంతకంటే నా జన్మకు సార్థకత ఏం కావాలి చెప్పు?" అంది.

"ఇంత మంచి బుద్ధి కలిగిన ప్రాణిని చంపి తింటే, నాకూ పాపం చుట్టుకుంటుంది' అనుకుని జింకను అలాగే వదిలేసి ఇంటిదారి పట్టాడు వేటగాడు.



ఏది గుండ్రంగా వుంది?



హాయ్ నేస్తాలూ... ఏడవ తరగతి చిన్నారులకు మినహా అందరికీ సెలవులు ఇచ్చేసినట్టున్నారే. ఏం చేస్తున్నారు? బోరుకొడుతోందా? మరయితే బాలనేస్తాలు పేజీ అంతా వదలకుండా చదివెయ్యండి.
సరే. అసలు విషయానికి వచ్చేస్తాం. పక్కన రెండు సున్నాలు వున్నాయి. చూశారా. పెద్ద సున్నాలో చిన్న సున్నా వుంది. ఈ రెండిటిలో ఏది గుండ్రంగా వుందో చెప్పాలి. 'అబ్బా! మరీ ఇంత తేలిక ప్రశ్నలా మమ్మల్ని వేసేది?' అన్నట్టు చూస్తున్నారు కొందరు నేస్తాలు. మరి కొందరేమో 'చిన్న సున్నా కొద్దిగా వంకరగా కనిపిస్తోందికాని. పెద్దది మాత్రం గుండ్రంగా వుంది' అంటున్నారు. సరే. మీ జవాబుల్లో మార్పులేమీ వుండవుకదా. అయితే మా సమాధానం చెప్పేస్తున్నాం. తర్వాత 'ఇష్..అబ్బా.!' అని చేతులు విదిలించకూడదు. చెప్పేస్తున్నాం. అసలు రెండు సున్నాలూ వంకరగానే వున్నాయి. కావాలంటే మరికాస్త పరిశీలనగా చూడండి. ఏంటి? మేం చెప్పింది నిజమేనా? మరి వచ్చే వారం మీకోసం మరో మేజిక్ తీసుకొస్తాం. రెడీగా వుండండే.

మేజిక్! మేజిక్!!

చుక్కలు కలుపుదామా!



పంపినవారు:
డి.రాజేష్,
5వ తరగతి,
రావినూతల.

చిన్నారి చిత్రకారులు

కపిల్,
9వ తరగతి,
కాకినాడ.



బి.సిద్దార్థ,
5వ తరగతి,
శ్రీ శారదా
విద్యామందిర్‌హైస్కూల్,
రామగిరి, నల్లగొండ.

[illegible]

[illegible]

క్విజ్-4

1.ఎస్కిమోల ఇళ్లను ఏ పేరుతో పిలుస్తారు?
ఎ. ఇగ్లూలు బి. క్యాయక్‌లు

2.పెన్సిళ్ల తయారీలో ఉపయోగించే ఖనిజం...?
ఎ. గ్రాఫైట్ బి. సిలికా

3. 'చండాలిక' రచయిత?
ఎ.రవీంద్రనాథ్‌ఠాగూర్
బి.బంకించంద్రచటర్జీ

4.భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురులను ఉరితీసింది?
ఎ.1931 మార్చి 23 బి. 1931 ఏప్రిల్ 23

5. రెండవసారి వచ్చే దంతాలను ఏమంటారు?
ఎ. పాల దంతాలు బి. శాశ్వత దంతాలు

6.మన మెదడు ఎంత బరువు వుంటుంది?
ఎ.1250 గ్రాములు బి. 1350 గ్రాములు

7. 2చే నిశ్శేషంగా భాగించబడే సంఖ్యలను ఏమంటారు?
ఎ. బేసి సంఖ్యలు బి. సరి సంఖ్యలు

8. చెస్‌లో మొదటి గ్రాండ్ మాస్టర్ ఎవరు?
ఎ. విశ్వనాథన్ ఆనంద్ బి. పి.హరికృష్ణ

9. మొదటిసారిగా అంతరిక్షంలోకి వెళ్లిన వ్యక్తి?
ఎ.యూరీగగారిన్
బి.వాలెంటినా తెరిస్కోవా

10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
ఎ. మాకినేని బసవపున్నయ్య
బి. లావు బాల గంగాధరరావు

క్విజ్ 3 జవాబులు

1. పంజాబ్ 2. నానాజాతిసమితి 3. బి.సి.జి 4. మే 5. ధృవపు ఎలుగుబంటు 6. నండూరి సుబ్బారావు 7. గాంధీజీ 8. చార్మినార్ 9.కేరళ10. సెహవాగ్

క్విజ్ 2కు సరైన సమాధానాలు రాసిన వారు :

ఎం.ప్రదీప్‌కుమార్, 9వ తరగతి, **ఎం.ప్రతిమ**, 7వ తరగతి, **డి.సుందరి, 5**వ తరగతి, కృష్ణలంక, విజయవాడ. **పి.పాండురంగారావు, బి.వెంకాయమ్మ, 9వ తరగతి**, గవరపాలెం. **సిహెచ్.మంగళ**, 8వ తరగతి, రెంటచింతల, గుంటూరు. **పి.లక్ష్మి, 9**వ తరగతి, **పి.లహరి, 7**వ తరగతి, గోనెగండ్ల, కర్నూల్. **బి.శ్రీరామ్, 10**వ తరగతి, కోడూరు, గుంటూరు.

కలం స్నేహం

పేరు:అంకూరి సుదర్శన్,
వయసు : 13 సం॥
చదువు :8వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు, కథలు చదవడం, చెస్, క్రికెట్ ఆడడం.
పూర్తి చిరునామా: అంకూరి సుదర్శన్, సన్నాఫ్ నర్సయ్య, నదగోడు, **మహబూబ్‌నగర్-509378.**

పేరు: కె.విజయ సాగరిక,
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు :ముగ్గులు వేయడం, చదవడం, టీవీ చూడడం, పాటలు పాడడం.
పూర్తి చిరునామా : కె. విజయ సాగరిక, సిపిఎస్ చింతపట్ల, యాచారం, **రంగారెడ్డి-501509.**

ఆషాఢభూతి కథ

దేవశర్మ అనే సన్యాసి ఊరూరా తిరుగుతూ వేదాంతం చెప్తుండేవాడు. భక్తులు ఆయనకు ఎంతోకొంత ఇచ్చుకుంటుండేవారు. అలా పోగైన ధనాన్ని ఓ బొంతలో దాచుకునేవాడు. ఇదంతా ఓ మోసగాడు చూడనేచూశాడు. ఎలాగైనా ఆ డబ్బును కాజేయాలనుకున్నాడు. అతని పేరు ఆషాఢభూతి. ఆషాఢభూతి ఒకరోజు సన్యాసి దగ్గరకు వెళ్లి ఎంతో వినయంగా వినవక్రతతో విసురుతూ 'స్వామీ! నాకు సంసారంమీద విరక్తి పుట్టింది. మీ శిష్యుడిగా చేర్చుకోండి. ఇప్పటినుంచి నా జీవితాన్ని మీ పాదాల దగ్గర గడపాలనుకుంటున్నాను' అన్నాడు.

ఆషాఢభూతి మాటలు విని సన్యాసి ఎంతో పొంగిపోయాడు. వెంటనే శిష్యునిగా చేసుకున్నాడు. ఆ క్షణం నుంచి ఆషాఢభూతి సన్యాసికి ఎంతో నమ్మకంగా సేవ చేయసాగాడు. సన్యాసి ఎక్కడికి వెళ్లినా ఆషాఢభూతిని వెంట తీసుకెళ్లేవాడు. తన సామానంతటినీ ఆషాఢభూతిచేతే మోయించేవాడు. ధనం వున్న బొంత మాత్రం ఆయనే మోసేవాడు.

అలా ఊరూరా తిరుగుతూ గురుశిష్యులు ఒక గ్రామంలో బస చేశారు. అనంతరం మరో చోటికి బయలుదేరారు. అప్పుడు ఆషాఢభూతి 'స్వామీ! మనం బసచేసిన ఇంటివారి చీపురుపుల్ల ఒకటి నా పంచెకు అంటుకుంది. పరాయివాళ్ల పూచికపుల్లను దొంగిలించడం కూడా మహాపాపం అని చెప్పారుకదా మీరు. అందుకని వాళ్లకు ఈ చీపురుపుల్లను ఇచ్చి వస్తాను' అన్నాడు.

ఆ మాటలకు సన్యాసి ఎంతో సంతోషించాడు. లోలోన ఆషాఢభూతిని ఎంతగానో మెచ్చుకున్నాడు. 'శిష్యా! నీ మాటలు నాకు ఎంతో నచ్చాయి. నీ బుద్ధికి ఎంతో మెచ్చాను. వెళ్లి ఇచ్చిరా' అన్నాడు. ఇహ ఆనాటి నుంచి సన్యాసి తన డబ్బు దాచుకున్న బొంతను కూడా ఆషాఢభూతిచేతే మోయించసాగాడు. ఓరోజు వారిద్దరూ అడవిలోంచి ప్రయాణిస్తున్నారు. దారిలో ఒక చెరువు కనిపించింది. సన్యాసి ఆ చెరువులో స్నానం చేయాలనుకున్నాడు. ఆషాఢభూతిని గట్టుమీద వుండమని చెరువులోకి దిగాడు.

అదే సమయంలో చెరువు అవతల గట్టుమీద రెండు పొట్టేళ్లు పోట్లాడుకుంటున్నాయి. వాటి తలలు పగిలి రక్తం కారి నేలమీద పడి గడ్డ కట్టింది. అప్పుడే అక్కడకు వచ్చిన ఒక నక్క గడ్డకట్టిన నెత్తురును మాంసం ముద్దనుకుంది. వెంటనే దాన్ని తినడానికి వాటి మధ్యకు వెళ్లి నలిగి చచ్చింది. ఆ దృశ్యాన్ని చూసిన సన్యాసి 'దురాశ వల్ల నక్కకు ప్రాణం పోయిందికదా' అనుకుంటూ గట్టుమీదకు వచ్చాడు. ఆషాఢభూతి కనిపించలేదు. 'నాయనా ఆషాఢభూతీ!' అని అనేకసార్లు పిలిచాడు. అయినా జవాబు లేదు.

ఆషాఢభూతి తనను మోసం చేసి ధనం వున్న బొంతను ఎత్తుకుపోయాడని సన్యాసికి అర్థమైంది. 'ఆ పొట్టేళ్ల వలన నక్క చనిపోయింది. ఆషాఢభూతిని నమ్మి నేను మోసపోయాను' అనుకున్నాడు సన్యాసి విచారంగా.

'అయితే నువ్వేం చెయ్యబోతున్నావు?' అని కరటకుడు అడిగాడు.

'ఇప్పుడు పింగళకుడు, సంజీవకుల మధ్య విభేదాలు సృష్టించాలి. ఉపాయంతో పని జరగనప్పుడు పరాక్రమం వల్లకూడా జరగదు. తనకు శత్రువు అయిన పామును ఒక కాకి ఎలా చంపిందో తెలిపే కథ చెబుతాను విను' అంటూ దమనకుడు చెప్పనారంభించాడు.

రియల్ స్టోరీ

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

స్వరాంజలి

గాలి వేణువులూదుతోంది. అలలు అలలుగా తేలివస్తున్న సంగీత సుగంధాలు వీనులకు విందు చేస్తున్నాయి. నిశ్శబ్దంలో వీణానాదం... మృదంగ విన్యాసం లయబద్ధమైన గాన మాధుర్యం కర్ణపుటాలకు గొప్పహాయిని కలిగిస్తున్నాయి.

కొల్హాపూర్ చివరలో కొత్తగా వెలసిన ఆ విద్యాలయం సంగీత దేవాలయం. సరస్వతీదేవి ఆరామం. సంగీత సామ్రాజ్యానికి కలికితురాయి.

గ్రామానికి దూరంగా ప్రశాంత వాతావరణంలో ఏర్పాటైన సంగీత విద్యాలయం ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చుట్టూ రంగురంగుల కాగితాలతో అలంకరణ చేశారు. ప్రవేశ ద్వారానికి ఇరువైపులా రెండు అరటి చెట్లను ఏర్పాటు చేశారు. కొత్తగా ప్రారంభించబడుతున్న సంగీత విద్యాలయానికి అహూతుల్ని కూర్చోబెట్టడానికి ముందుగా చిన్నవేదిక ఏర్పాటు చేసి అతిథుల కోసం కుర్చీలను సర్దుతున్నారు.

దేవాలయం మధ్యలో పెద్ద వరండా.

అక్కడ వరుసగా పేర్చిన వీణలు, తబలాలు... మృదంగం వంటి సంగీత పరికరాలన్నీ అమర్చారు. ఒక్కో సంగీత వాయిద్యం ముందు అందంగా అల్లిన తుంగచాపలు పరిచారు. కొన్నింటి ముందు సంగీత కళాశాల విద్యార్థులు కూర్చుని అలవోకగా వాయిస్తున్నారు. కొంతమంది వీణలు సరి చేస్తున్నారు.

ప్రారంభోత్సవానికి ఇంకా సమయం ఉండటంతో కొంతమంది తమకు వచ్చిన సంగీతాన్ని పలకరిస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతమంతా సంగీత పరిమళం గుభాళిస్తోంది.

ఇంతలో సంగీత విద్యాలయం ముందు కారు ఆగింది. డాక్టర్ అంజలి అందులో నుంచి నెమ్మదిగా దిగింది. తన కలల రూపం ప్రారంభోత్సవం జరుగుతుండటం ఆమె మనస్సులో చెప్పలేని ఉద్వేగాన్ని కలిగిస్తోంది.

"మేడమ్ వచ్చారు... మేడమ్ వచ్చారు!" లోపల నుంచి పిల్లలు బిలబిలమంటూ అంజలిని చుట్టుముట్టారు. వారితో కలిసి ఆమె లోపలికి వచ్చి – "అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి కదా? అరగంటలో అతిథులంతా వచ్చేస్తారు.. ప్రారంభోత్సవం తర్వాత చిన్న సమావేశం ఉంటుంది. అంతే... రేపటి నుంచి సంగీతం క్లాసులు మొదలవుతున్నాయి. గేటు వద్ద ఇద్దరు ఉండి వచ్చిన వాళ్ళను రిసీవ్ చేసుకుని లోన కుర్చీల్లో కూర్చోబెట్టండి... మరో ఇద్దరు కూల్‌డ్రింకులు అందించండి..." అంజలి శిష్యులకు ఆదేశాలు ఇచ్చింది.

ఆ విద్యాలయంలో శిష్యులుగా చేరడమే గొప్ప విషయంగా భావిస్తున్న అమ్మాయిలంతా చకచక పనులన్నీ చక్కబెడుతున్నారు. అంజలి ప్రమేయం లేకుండానే మొత్తం ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు.

అతిథులంతా విచ్చేశారు.

రిబ్బన్ కత్తిరించి సంగీత విద్యాలయాన్ని ప్రారంభించారు. తర్వాత ముఖ్య అతిథులందర్నీ వేదిక మీదకు ఆహ్వానించి చిన్న సమావేశాన్ని నిర్వహించారు. సంగీతంపై మక్కువ కలిగిన వారందరికీ సంగీత జ్ఞానాన్ని ప్రసాదించడానికి డాక్టర్ అంజలి చేసిన కృషిని వచ్చిన వారంతా ప్రశంసించారు. ఎంతోమందికి ఆదర్శ ప్రాయంగా వున్న ఆమె సంగీత సరస్వతి అని పొగిడారు.

ముఖ్య అతిథి శివాజీ యూనివర్సిటీకి చెందిన సంగీత శాఖాధిపతి భారతీ వైశంపాయన్ మాట్లాడుతూ – "అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా అమ్మా నాన్నా కష్టపడి ఖర్చు పెట్టి చదివిస్తున్నా అత్తెసరు మార్కులతో గట్టెక్కేవాళ్ళు ఉన్న ఈ రోజుల్లో అంజలి తన వైకల్యాన్ని అధిగమించింది. ఆత్మవిశ్వాసంతో అంచెలంచెలుగా ఎదిగింది. కళ్ళు లేవని ఆమె ఇల్లు కదలకుండా ఉంటే ఆమె గురించి మనం ఈ రోజు ఇలా చెప్పుకునే వాళ్ళం కాదు. లేని దాని సంగతి వదిలేసి చేయగలిగేదేదో తెలుసుకుని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగమని, జీవితాన్ని స్వయంగా నిర్దేశించుకుని స్వతంత్రంగా బతకమని చెప్తోంది అంజలి జీవితం.. ఆమె డాక్టరేట్ సాధించిన తొలి అంధురాలు.. ఆమె పేరుకు, చూడటానికీ అంధురాలు.. ఎంతోమంది సంగీత ప్రియుల్ని అలరించే విద్వాంసురాలు... సంగీతాన్ని నేర్చుకోవాలనే వారికి మార్గదర్శకురాలు..." వైశంపాయన్ చెప్పడం ఆపారు.

అందరూ అంజలి వైపు చూస్తున్నారు.

"డాక్టర్ అంజలి మాట్లాడాలి...." వేదిక మీద ఉన్న సభాధ్యక్షుడు ఆహ్వానించాడు.

అంజలి లేచి నిలుచుంది.

"మీ అభిమానానికి కృతజ్ఞతలు... మీ ప్రోత్సాహం నాకింకా కావాలి. అందరూ మెచ్చుకునే స్థాయి కల్పించింది మీరే... మీరే..." తర్వాత ఆమె నోటి నుంచి మాటలు రాలేదు.. నల్లకళ్ళద్దాల వెనుక మూత పడ్డ కళ్ళ నుంచి వేడికన్నీళ్ళు చెక్కిళ్ళపై జాలువారాయి.

నమస్కరించి కూర్చుండి పోయింది అంజలి.

* * *

అంజలి నిగ్వేకర్. మహారాష్ట్ర కొల్హాపూర్‌లో మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది. పుట్టుకతోనే అంధురాలైన కూతురిని చూసి తల్లిదండ్రులు గొల్లుమన్నారు. అందరితో పాటు తనూ చదువుకుంటానని తల్లిదండ్రులతో చెప్పడంతో నాగపూర్‌లో ప్రత్యేక అంధుల పాఠశాలలో ఆమెను చేర్పించారు. బ్రెయిలీ లిపిలో చదవడం, రాయడం నేర్చుకుంది. ప్రత్యేకంగా తయారు చేసిన పలకలతో లెక్కలు చేయడం తెలుసుకుంది. ఒకోవిషయం అర్థం అవుతుంటే అంజలికి చదువు పట్ల మక్కువ ఎక్కువ అయ్యింది.

ప్రాథమిక స్థాయి తర్వాత ముంబాయిలో దాదర్ స్కూల్ ఆఫ్ బ్లైండ్‌లో చేరింది. అక్కడ మరిన్ని కొత్త విషయాలపై అవగాహన పెంచుకుంది. చాలా పెద్ద పాఠశాల అయినందున గ్రంథాలయం, ప్రయోగశాల వంటివన్నీ వినియోగించుకుని అన్నింటిలోనూ ఫస్టు మార్కులను సంపాదించుకుంది. కళ్ళు లేకపోయినా అంతర్ నేత్రంతో ఎన్నో విషయాలను ఆమె అవగాహన చేసుకుంది. ఇంగ్లీషు భాష, టైపు వంటివి కూడా నేర్చుకుని ప్రావీణ్యం పొందింది.

ఆ సమయంలో సంగీతం పట్ల ఆమెకు ఎక్కువ మక్కువ కలిగి ఆ రంగంలో విశేషంగా కృషి చేసి సంగీత సాధన చేసింది. సంగీత విశారద పరీక్షల్లో మంచి మార్కులతో పాసైంది. తర్వాత హయ్యర్ సెకండరీ విద్య కోసం ఎస్.ఎన్.డి.టి. మహిళా విశ్వవిద్యాలయంలో చేరి చదువు వట్ల దృష్టి కేంద్రీకరించింది. హెచ్.ఎస్.సి.లో 80శాతం మార్కులు పొంది అంధ విద్యార్థులందరిలో ప్రథమ స్థానం సంపాదించింది. ఇందుకోసం ఆ విశ్వవిద్యాలయం ఇచ్చే థానావాలా అవార్డుతో పాటు నాగార్కర్ ప్రైజును కూడా పొందింది.

అక్కడితో అంజలి కళాతృష్ణ తీరలేదు.

నాగపూర్‌లో ఉన్న ధరమ్‌పీఠ్ కాలేజీలో డిగ్రీలో చేరింది. కాలేజీ మొత్తం మీద అంజలి మాత్రమే అంధ విద్యార్థిని. ఆంగ్ల సాహిత్యం, సంగీతం, ఇండియన్ ఫిలాసఫీ, ఆప్షనల్ సబ్జెక్టులతో డిగ్రీలో కళాశాలలో ఫస్టుమార్కు పొందింది. అంతేకాకుండా ఆ ఏడాది నాగపూర్ యూనివర్సిటీ పరిధిలో ఏడవ ర్యాంకు సంపాదించింది. సంగీతాన్ని ప్రధానాంశంగా ఎం.ఎ.లో చేరి నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌తో శివాజీ యూనివర్సిటీ మెరిట్‌లిస్టులో నాల్గవ స్థానం సంపాదించింది.

ఆ సమయంలోనే ఆమెకు కొల్హాపూర్ శివాజీ యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో అధ్యాపకురాలిగా ఉద్యోగ అవకాశం లభించింది. దీంతో సంగీతం ఆమె జీవితంలో ఒక భాగం అయిపోయింది. 'ఉత్తర హిందూస్తాన్ కాంథా సంగీత్ - ధ్రుపద్ ధమార్ టు ఖ్యాల్ నిర్మిత్ - ఎ స్టడీ" అనే శీర్షికతో సంగీతంపై ఆమె పరిశోధన ప్రారంభించారు. ఈ పిహెచ్.డి. అధ్యయనానికి 'వరల్డ్ బ్లైండ్' యూనియన్ వారి అంతర్జాతీయ నిధి అయిన యెర్మాయిన్ గ్రాంటు కాలహన్ నుంచి రెండు వందల అమెరికన్ డాలర్ల అవార్డు లభించింది. దీంతో ప్రత్యేక పద్ధతిలో పరిశోధన జరిపి థీసిస్‌ను సమర్పించింది. 2000 సంవత్సరం డిసెంబర్‌లో ఆమెకు డాక్టరేట్ ప్రధానం జరిగింది.

అప్పటి నుంచి అంజలి నిగ్వేకర్ వెనక్కి తిరిగి చూడలేదు. సంగీత సాధనలో మైమరచి పోయేవారు. తనకు తెలిసిన సంగీత పరిజ్ఞానాన్ని పది మందికి పంచాలన్న ఆశయంతో సంగీత విద్యాలయాన్ని ప్రారంభించారు.

* * *

అంజలి స్థాపించిన సంగీత విద్యాలయం మొదటి వార్షికోత్సవం ఏర్పాటైంది. ఏడాదిలో ఎంతోమంది సంగీత ప్రియులు, అభిమానులు ఆ సంస్థలో చేరారు. అంజలి ఆధ్వర్యంలో రకరకాల వాద్యపరికరాలు సరిగమ... పదనిసలను అలవోకగా పలికిస్తున్నాయి.

విద్యాలయం ముందు చిన్నవేదిక.

అంజలి వద్దంటున్నా సంగీతం నేర్చుకోవడానికి చేరిన పిల్లలంతా ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఏడాది పాటు విద్యాలయం సాధించిన ప్రగతిని ఒక్కొక్కరు వివరించారు. అంజలి కృషి సంగీతాభిమానులకు కలిగించిన ఆనందాన్ని ఒక్కొక్కరు పొగిడారు.

కార్యక్రమం పూర్తయిన తర్వాత ఒక్కొక్కరు వెళ్ళిపోయారు. అంజలి విద్యాలయం వద్ద కుర్చీలో కూర్చుంది.

ఇంతలో పోస్టుమాన్ టెలిగ్రావ్ అందించాడు.

నేషనల్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా నియమిస్తూ వచ్చిన సమాచారమది. ఒకప్పుడు ఆ సంస్థ 'నీలమ్‌కంగా నేషనల్ అవార్డు' పొందిన అంజలి అదే సంస్థలో ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా నియామకం కావడం గొప్ప ఆనందాన్నిచ్చింది.

టెలిగ్రామ్‌లో ఒక్కొక్క పదం రెండేసి సార్లు చదివించింది. విషయం తెలుసుకుని శిష్యులంతా ఆమెను అభినందనలతో ముంచెత్తారు.

అంజలి హృదయం బాధతో బరువెక్కిపోయింది.

సంగీత విద్యాలయానికి దూరంగా నడుచుకుంటూ వెళ్ళింది. చుట్టూ ఏమి ఉన్నాయో తెలియడం లేదు. ఆనందాన్ని కొలిచే సాధనం ఎలా ఉంటుందో తెలీదు... అది హృదయంలో ఎవరెస్టు శిఖరంలా పెరిగిపోయిందని అన్పిస్తోంది.

సంతోషపు పులకింత ఒళ్ళంతా కమ్ముకుంది.

శూన్యంలో చైతన్యం కనిపిస్తుంది.

అక్కడ .

గాలి వేణువులూదుతోంది... అలలు అలలుగా గాలిలో తేలి వస్తున్న సంగీత సుగంధాలు వీనులకు విందు చేస్తున్నాయి. నిశ్శబ్దంలో వీణానాదం... మృదంగ విన్యాసం లయబద్ధమైన గాన మాధుర్యం కర్ణపుటాలకు గొప్ప హాయిని కలిగిస్తున్నాయి. ★

ఒక వ్యూరి కథ....

(9వ పేజీ తరువాయి)

తనకు తానుగా ఆ భూమాత ఒడిలో చేరిపోయాడయ్యా" బాధతో గుండె బరువెక్కుతుండగా చెప్పాడు మామయ్య.

ఉన్న ఇల్లు, పొలం అయిన కాడికి అమ్మేసి కూతుళ్ళిద్దరి పెళ్ళి అయిందనిపించిన సీతమ్మ విజయవాడలోని ఓ ప్రైవేటు కాలేజీలో వంటమనిషిగా పని చేస్తోంది" కళ్ళొత్తుకుంది అమ్మ.

"మరి రాఘవేంద్ర... నా కంటే కొద్దిగా చిన్నవాడు. ఏం చేస్తున్నాడు..

"ఏం చెప్పను...? ఇంటర్ తర్వాత ఐ.టి.ఐ. ఫిట్టర్ చేశాడు. 40 వేలు కట్టి ఆల్విన్‌లో ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఇక ఫర్వాలేదు. వాడి జీవితం ఓ గాడిన పడింది అనుకునే సమయంలో ఆ సంస్థ మూతపడింది. వాడు రోడ్డున పడ్డాడు. ఇంటి దగ్గర పరిస్థితీ అనుకూలంగా లేదు. హైదరాబాద్‌లోనే ఉండి చిన్న చిన్న ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. ఫలించలేదు. ఇంటికొచ్చి తండ్రికి భారం కాలేక, తనను తాను పోషించుకోలేక భవన నిర్మాణ కూలీగా మారాడు. తర్వాత ఓ యాక్సిడెంటులో చనిపోయాడు" అని చెప్పాడు మావయ్య.

"నీకేం రా... అమెరికాలో హాయిగా వున్నావ్... ఇక్కడి బాధలు నీకేం అర్థం అవుతాయి. నా సంగతే చూడు.. నేను పని చేసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ప్రైవేటు పరం చేసింది. 15 ఏళ్ళుగా అక్కడ పని చేసిన నేను తప్పనిసరై స్వచ్ఛంద పదవీ విరమణ చేయాల్సి వచ్చింది. ఇప్పుడా కొత్త కంపెనీకి వేం అవసరమే. కానీ మా సీనియారిటీని, ఎక్స్‌పీరియన్స్‌ని దృష్టిలో పెట్టుకోదంట. కొత్తగా మేం రెండు వేల రూపాయలతో జీతం మొదలు పెట్టాలంట... ఎదిగొచ్చిన పిల్లలు, పెరిగిన ఖర్చులు ఇక్కడ ఉండి వ్యవసాయం చేద్దామంటే.... అదీ అంతతమాత్రం... చిన్న రైతులు తట్టుకోలేకపోతున్నారు. మీ బాబాయి లాంటి పెద్ద రైతులే చితికిపోయి, జీవితాలు అస్తవ్యస్తం అవడం" మధ్యలో మావయ్య అందుకుని "ఈ మధ్య కాలంలో మన చుట్టు పక్కల 10 మందిపైనే ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చేద్దామంటే పని దొరక్క తింటానికి తిండిలేక, అప్పు ఇచ్చే నాధుడు లేక ఆకలి చావులూ రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. గతంలో అరెకరం, ఎకరం, రెండెకరాలో, మూడెకరాలో ఉన్న చిన్న... సన్నకారు రైతులు ఎక్కువగా ఉండేవారు. ఇప్పుడు ఎవరూ కన్పించడం లేదు. ప్రకృతి కన్నెర్ర చేయడంతో పాటు పాలకుల విధానాలూ ఇందుకు కారణమే. భూమి కూడా కొందరి చేతుల్లో కేంద్రీకృతమైపోతోంది. అయినా మన ప్రభుత్వాలకు చీమకుట్టినట్లయినా లేదు. ఎన్నికల సభల కోసం, ఓటరును ఆకర్షించడం కోసం, ఎన్నికల్లో సారా ఏరులై పారించడం కోసం కోట్లాది రూపాయలు విచ్చలవిడిగా ఖర్చు చేసేస్తారు. కానీ ప్రజా సమస్యలపై స్పందించరు. స్వార్థం.... అంతా స్వార్థం" ఆవేశంగా, ఆవేదనగా అన్నాడు మావయ్య.

ఉన్నది కొద్ది ఇళ్ళే అయినా, చిన్న ఊరే అయినా పిల్లా పాపలతో ఎంతో సందడిగా ఉండే ఊరు ఇప్పుడు వల్లకాడులా . నిశ్శబ్దంగా...., హృదయాంతరాళాల్లో పేరుకుపోయిన బాధను అలాగే సమాధి చేసేస్తూ...

ఇన్నాళ్ళూ... తాను భ్రమల్లో ఉన్నాడన్నమాట. మన ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు అమెరికా వచ్చినప్పుడు చెప్పే మాటలు విని కంప్యూటర్ రంగంలో ఎదుగుతున్న ఆంధ్రదేశాన్ని గురించి తెలుసుకొని భారత్ వెలిగిపోతోందనుకున్నాను. హైదరాబాద్‌లో దిగగానే కన్పించిన నున్నగా నిగనిగలాడే రోడ్లు, ఫ్లైఓవర్లూ, వాటిపై సాగిపోయే ఖరీదైన కార్లూ, ఐమాక్స్ థియేటర్, స్నోవరల్డ్... ఎన్టీఆర్ ఘాట్...ఓహ్ హైదరాబాద్ చాలా చాలా అభివృద్ధి చెందిందని ఆనందపడిపోయాను. హైదరాబాదీల వేషభాషల్లో మార్పు.... పిజ్జాలు... బర్గర్‌లు... పబ్‌లు... డిస్కోథెక్‌లు... ఎంతమార్పు... ఎంత అభివృద్ధి... మనమూ ఇప్పుడు పాశ్చాత్య దేశాల్తో పోటీ పడ్తూ... అని ఎంత గర్వపడ్డాను... నిజంగా అది అంతా అభివృద్ధేనా...?

బుక్కెడు మెతుకుల కోసం... బతుకు బండి లాగలేక నిరాశకు లోనై జీవితాన్ని చాలించుకునే పేదలు... నిన్నటి చిన్న, సన్నకారు రైతులు ప్రకృతి వైపరీత్యాలకు, పేట్రేగిపోతున్న స్వార్థ శక్తులకు తోడు ప్రభుత్వ నిరాదరణ తోడై రోజురోజుకు దుర్భరంగా మారిపోతున్న పరిస్థితులు... పుట్టెడు బాధను కనురెప్పల మాటున దాచుకునే నిర్భాగ్యులు... పెరిగిపోతున్న నా దేశం వెలిగి పోతోందా....? నా భారత్ వెలిగిపోతోందా...? ★

వద్దు వద్దంటూనే...

లక్ష్మి

కథలూ కవిత్వాలూ -

అధిక సంఖ్యలో మగమారాజులే రాస్తున్నారు!

సొంత ఇంటో శ్రీనాథ కవి మాదిరి వెలుగుతున్నారు!

సదరు శ్రీనాథుడు ఆ యొక్క రాత పనిలో వున్నప్పుడు - అంతోటి రాతకోతలకు అవసరమైన సపర్యలూ, సేవలూ చేసే బాధ్యత వారి అర్థాంగి తీసుకోవాలని రూలు పెడుతున్నారు!

ఆ పనిలో ఆమెను గుంజీళ్ళు తీయిస్తున్నారు!

ఎట్టి పరిస్థితిలోనూ శ్రీవారి మూడు పాడు కాకూడదు! అందుకు అనువైన జాగ్రత్తలు ఆమె తీసుకోవాలి!

శ్రీవారికి కాఫీ కావాలో చెక్కపొడి నములుతారో అడక్కూడదు. అడిగి వారి ఏకాగ్రత చెడగొట్టకూడదు!

శ్రీవారిని ఏమీ అడక్కుండానే -

వారికి ఎప్పుడు ఏది అవసరమో సమస్తం గ్రహించే శక్తి ఆమెకు తప్పనిసరిగా వుండాలి!

శ్రీవారికి సేవ చేస్తూ వారి చేత నాలుగక్షరాలు రాయించి పుణ్యం కట్టుకుంటున్న ఆమె రుణం ఎట్లా తీర్చుకోవాలి!

ఈ విషయం శ్రీవారు బొత్తిగా పట్టించుకోరు!

పైపెచ్చు - ఆమె పట్ల చులకన భావం పెంచుకుంటున్నాడు. అతని రచనల్లో ఆమెను ఒక పాత్రగా మలిచి 'ఆడవాళ్ళింతే సుమా' అని పాటలు రాస్తున్నాడు. పేరు తెచ్చుకుంటున్నాడు. డబ్బు చేసుకుంటున్నాడు!

రానురానంటూనే చిన్నదో చిన్నది...

రాములోరి గుడికొచ్చే చిన్నదో చిన్నది-

అంటున్నాడు. ఆ పాట విని జనం భేష్‌భేషంటున్నారు. బావుంది బావుందంటున్నారు!

ఆ పాట విని ఆడవాళ్ళ గొడవలిట్లాగే వుంటాయి కాబోలని జనం అనుకుంటున్నారు!

వెనకటికి -

అవునంటే కాదనిలె... కాదంటె అవుననిలే!

ఆడవారి మాటలకు... అర్థాలే వేరులే! అనే పాట వినిపించి సొమ్ము చేసుకున్నారు. ఇప్పుడు 'రానురానంటూనే' అనే పాటని వెలుగులోకి తెచ్చేరు!

నిజానికి -

ఆ పాటల్లో వున్న మడతలన్నీ మగవాళ్ళకే చెల్లు!

అట్నుంచి నరుక్కొచ్చే నైజం వాళ్ళ సొంతం! వాళ్ళ మాటల్ని నమ్మకూడదు. వాళ్ళ రాతల్ని నమ్మకూడదు.

మన రాష్ట్రం మన దేశంలో వున్న మగవాళ్ళకి మాత్రమే ఈ మాయలు తెలుసనుకోడం పొరపాటు!

ఏ దేశంలో ఎక్కడున్నా-

సమస్తమైన మగవాళ్ళు ఇల్లాగే వుంటారు!

మనసులో మాట బయటపడకుండా జాగ్రత్త పడతారు!

చరిత్ర తిరగెయ్యండి. బోలెడు గొడవలు తెలుస్తాయి. నెత్తిమీద కిరీటం తొడుగుతాం తలవంచండి ప్రభూ అంటె - వద్దు వద్దని అలనాడు సీజరు గారు మారాం చేసేడు. ఆయన వద్దంటున్న కొద్దీ ప్రజల్లో పంతం పెరిగిపోయింది!

ఎట్టి పరిస్థితుల్లోనూ తమరే ఈ కిరీటం ధరించాలని నినాదాలు చేసేరు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇక తప్పదనే ధోరణితో సీజరు తలవంచేడు!

నిజానికి -

కిరీటమ్మీద మోజులేక సీజరు వద్దనలేదు!

అదొక డిప్లొమసీ! అంతే!

పదవీ స్వీకారం ఈ టైపులో జరిగితేనే గొప్ప కళాత్మకంగా వుంటుంది!

అంతేగాని -

'అదిగో కిరీటం అనగానే ఇదిగో నా తల' అంటో కిరీటమ్మీద యావ ప్రదర్శిస్తే జనంలో చవగ్గా కనిపిస్తారు!

వారికి పదవీ వ్యామోహం హెచ్చు స్థాయిలో కలదనే రిమార్కు వస్తుంది. రాకూడని దిక్కుమాలిన రిమార్కు వచ్చింతర్వాత - పొరపాటున ఎన్ని ఘనకార్యాలు చేసినా - అదంతా పబ్లిసిటీ స్టంటని ప్రజలు అపార్థం చేసుకుంటారు!

అంచేత -

వద్దూ వద్దూ అనే మగవాళ్ళల్లో తొంభై శాతమ్మంది కావాలీ కావాలీ అనే కోరుకుంటారు! అడగ్గానే యిస్సంటే అలుసైపోతామనే భయంతో కొంచెం బెట్టు చేస్తారు! కావాలనే మాట బయట పెట్టకుండా జాగ్రత్త పడతారు. అంతే!

శ్రీవారి ఫ్రండెవరో మనింటికి భోజనానికి వస్తాడు!

అతనికి పప్పుదోసకాయంటె చాలా యిష్టమని శ్రీవారే చెబ్తారు!

అంచేత -

పప్పుదోసకాయతోనే వంట చేస్తాం. అంతమాత్రాన అతను ఇంకా ఇంకా వడ్డించమని అరిగిపోయిన రికార్డల్లె అడగాలని వున్నా అడగడు!

అడిగితే -

అతనికి 'పప్పుదోసకాయ' అనే పేరు పెడతామని అతని భయం! అంచేత మాట మాత్రంగా వద్దంటాడేగాని - మనం వడ్డించే పప్పుదోసకాయకి చెయ్యి అడ్డం పెట్టడు!

ఇంటో భోజనాలట్లా వుంచండి!

పెళ్ళి భోజనాల్లో మగమారాజు గొప్ప హైరానా పడిపోతూ వుంటాడు. అతనికి బందరు లడ్డూ మీద ఇంట్రెస్టెక్కువ!

వడ్డించిన సంఖ్యతో తృప్తి పడడు!

అదనంగా కావాలనిపిస్తుంది!

అడగాలంటే మొహం చెల్లదు!

అంచేత-

తన పక్కన కూచున్న మనిషితో పరిచయం లేక పోయినా - ఈ మేస్టారికి బందరు లడ్డూలంటే గొప్ప యిష్టమని ప్రకటిస్తాడు. మరికొన్ని వడ్డించమని చొరవగా ఆర్డరు వేస్తాడు!

తద్వారా -

తన విస్తట్లో కూడా - వద్దు వద్దంటూనే లడ్డూల వర్షం కురిపించుకుంటాడు!

గొప్ప చమత్కారి కదా - మగమారాజు! ★

మండూక మహానందం

రుక్మిణి

"ఒరె అబ్బాయిలూ... కప్పలు వేసంకాలం రాంగానే ఎక్కడా నీళ్ళు దొరకవు కాబట్టి ఏం చేస్తాయిరా...? బొక్కలు... బొరియల్లోకి దూరి నిద్దట్లోకి జారిపోతాయన్నమాట" – సైన్సు సారు పాఠం చెప్తున్నారు. పిల్లగాండ్లు చెవులప్పగించి వింటున్నారు. "అయితే అట్లా మూడ్నాలుగు నెల్లు మగతలోనే పడుండి, ఇంగ వానలు రాంగానే బెకబెకమని తిండి కోసం మడుగుల్లోకి దుముకుతాయి. ఒరే... అవి ఒక మడుగుల్లోనే కాదు... ఎక్కడ నీళ్ళూ.. చేపలూ, పురుగులూ బాగా దొరుకుతాయనుకుంటే అక్కడికే బెక బెకా... బెకా బెకా...

జక్కులోడి పుత్రరత్నం నీలకంటం గాడు కండ్లు సగం మూస్తూ తెరుస్తూ హరికథ వింటున్నాడు... కండ్ల నిండా కప్పలే కప్పలు... బెక... బెక...

* * *

పొద్దున్నే కంటం గాడు వూడిపోతున్న లాగూని లాక్కుంటూ బయటకు వచ్చి చూస్తే ఏముంది. రాతిరి పెద్దవాన బడ్డది కాబోలు... కమ్మటి వాసన... బయటంతా బురద – వాడట్లా వూరి బయటకు పొయ్యి చూస్తే దూరంగా చెరువులో కానిని నీళ్ళు మెరుస్తున్నాయి. కొన్ని కొంగలు అపుడే చెట్ల మీది నుండి ఎగురుతున్నాయి – మైదానంలోని చింతచెట్టు పక్కనే ఇటుకబట్టీలకు తవ్విన మూడు గుంటలకు నిండుగా నీళ్ళు నిండినాయి. అదికాదు చిత్రం. ఆ మూడు గుంటల నిండుగా కప్పలు చేరి పికపిక లాడుతున్నాయి. కంటంగాడికి భలే ఆనందం కలిగింది. ఎందుకంటే ఆ కప్పలన్నీ వింత వింత రంగుల్లో ఎగురుతున్నాయి. అందులో ఒక కుంటలో నల్లవీ... మరో గుంటలోతెల్లనివీ... మూడో కుంటలో పచ్చవీ బెకబెక మంటున్నాయి.

"అరె... ఎన్ని రంగుల కప్పలో... మరిన్ని రోజులు అస్సలు కనిపించనే లేదు. ఒక్కవాన పడంగానే బొరియల్లోంచి బయట పడ్డాయి – సైన్సు సారు చెప్పింది కరక్టే!" కంటంగాడు ఓ మడుగు ముందు కూచుని తెల్లకప్పలను చూస్తూ అన్నాడు. అందులోనుండి ఓ కప్ప చెంగున ఓ గెంతు గెంతి బెకబెకమని నల్లకప్పల మడుగులోకి దూకింది. నల్లకప్పలు బెక బెక... ఒకటే రొదకు తగులుకున్నాయి.

విచిత్రం... వాటి బెకబెకలు కంటంగాడికి పూరాగా అర్థమైపోతున్నాయి. అరె! తనకు కప్పల భాష వచ్చేసింది... ఓహో! ఆ బెకబెకలకు అర్థం "అరె... మేమే మా గతులేందో... ఏ సీటో... వస్తయో... రాదో అని తన్నక చస్తుంటే మళ్ళా నువ్వా వచ్చిపడ్డావే!" కంటంగాడు ఒడ్డున చేరి ఉత్సాహంగా శ్వాసలు పీలుస్తున్న ఓ తెల్లకప్పను పలకరించాడు.

"కప్పతాతా... ఏంది అంత కోపంగా వున్నవ్.. ఏమయింది?" తెల్లకప్ప తాత బెకబెకలాడింది" అరె... నా చిన్నతనం నుండీ ఈ 'మడుగు'లోనే పుట్టి సేవలు చేస్తున్నా... వీళ్ళు నన్ను లెక్క చెయ్యటం లేదు. నేను నోరు తెరిచి బెకబెకమన్నా నాకో 'స్థానం' ఇవ్వటం లేదు... థు...

"మరి మీ మడుగులోంచి కొన్ని కప్పలు ఆ నల్లమడుగులోకి... పచ్చమడుగులోకి దూకుతున్నాయిగా!" కంటంగాడు అమాయకంగా అడిగాడు. అంతలోనే పచ్చకప్పలు కొన్ని నల్లకప్పలు కొన్ని ఒక మడుగులోంచి మరో మడుగులోకి ఒకటే దూకుడు... హైజంప్... లాంగ్‌జంప్! అట్లా రంగురంగుల కప్పలు ఆ మడుగుల్లోంచి మరో మడుగుల్లోకి బెకబెకమని దూకుతుంటే కంటం గాడికి భలే వినోదం... లపలప చప్పట్లు చరిచాడు.

మడుగుల ఒడ్డుల నిండా రంగురంగుల కప్పలు... ఏ కప్పకి ఏ మడుగులోకి దూకాలా అన్న సందేహం... అటు ఇటు వూరికే దూకి బెకబెకమని చెవులు పగిలేలా ఒకటే లుకలుకలు... అరె!

ఒక నల్లకప్ప తెల్లకప్ప ఎదురయ్యాయి. కాసేపు గుర్రుగా చూసుకుని బెకబెకలాడాయి –

"నీ పద్ధతులు నాకు మొదట్నుంచీ తెలుసు – దగుల్బాజీ యవ్వారాలు – ప్రజాసేవకు పనికిరావు – ఫలానా పథకం కింద వందకోట్లు మింగి నీతులు చెప్తున్నావు – ఛీ...!" నల్లకప్ప తెల్లకప్పను చీదరించింది.

"అబ్బో... నీ జాతి కుంభకోణాలు... అవినీతి... నీ పెండ్లాం పేరు మీద వందల కాంట్రాక్టులు పట్టి బినామీ బిల్లులు ఎత్తిన నువ్వు నీతులు చెప్పే వాడివి...!" తెల్లకప్ప వెటకారంగా అంది. అపుడే అటుదూరిన పచ్చకప్ప వెంటనే సముదాయించింది. "అరె... ఇవుడు ఇద్దరూ పచ్చమడుగులో దూకుతున్నారుగా... ఇంకా ఎందుకీ రుసరుసలు..." అని కోప్పడంగానే తెల్ల, నల్లకప్పలు ఆప్యాయంగా బెకబెకమని కావిలించుకుని పచ్చకప్పల మడుగులోకి దూకాయి.

మరో మడుగు ఒడ్డున కాషాయ కప్పలు గుంపుగా చేరి, ఒకదాన్నొకటి ఎగబడి కరుచుకుంటున్నాయి. మూతులు కరిచి, కాళ్ళను నవుల్తుంటే 'బెకో... మసీదు.. బెకో మందిరం".. బెకో టికెటు" అని కొన్ని ఆర్తనాదాలు చేస్తున్నాయి.

"ఒకళ్ళ మీద ఒకళ్ళు తమకు సరైన స్థానాలివ్వలేదని వాటిల్లోనే అవి తీవ్రంగా పోట్లాడుకుంటున్నాయి." కంటంగాడికి వాటి కీచులాట భలే ఆనందం కలిగించింది. అయితే ఓ మడుగు మధ్య ఓ మండూకం ఠీవిగా కాళ్ళమీద కాళ్ళేసుకుని కూచుంది. నల్ల–తెల్ల–పచ్చ–కాషాయ కప్పలు దాని చుట్టూ చేరి భజనలు చేస్తున్నాయి. కంటంగాడు ముసలి కప్పను వివరం అడిగాడు.

"అదా... గ్లామరు కప్పనీ... మాజీలే... తన గ్లామరుతో మిగిలిన వాళ్ళందరినీ ప్రభావితం చేయగలననీ నమ్మకం – ఎవరు ఎక్కువ డబ్బా.. మర్యాదా... మరింత మేతా ఇస్తే ఆ మడుగులో దూకుతానంటుంది. ప్చ్... గ్లామరు కప్పలు వాటి పని అవి చేసుకోకుండా మా జోలెందుకో..." ముసల్ది విచారంగా అని తలబాదుకుంది.

కంటంగాడు లేచి నిలబడగానే ఓ దగ్గర రెండు పచ్చ కప్పలు.. రెండునల్లకప్పలు వాటి వాటి కంఠాలు దొరకబుచ్చుకుని కుమ్ముకుంటున్నాయి. వీటిలో ఇంత ద్వేషం... రోషం వుంటే దేనికి పనికి వస్తాయి. 'ముసలి కప్ప విచారం ప్రకటించేలోపునే కప్పలన్నీ గావురుమని గప్‌చిప్‌గా మారి బిగదీసుకుపోయాయి. కంటంగాడు చూస్తే కోరలు చాస్తూ బుసలు కొడుతున్న తాచుపాము... నీలంచారలతో మెరిసిపోతోంది. అన్ని రంగుల కప్పలూ క్యూలు గట్టి దానిముందు మోకరిల్లుతున్నాయి.

"అమెరికా పామో... హామ్మో..." ముసలికప్ప చతికిలబడింది. కంటంగాడు హడలిపోయి 'పామో – వామ్మో' అని కేకలు పెడుతూ మంచం మీద నుండి కిందపడ్డాడు. వాడి కల చెదిరింది. జక్కులోడు తిట్లకు లంకించుకున్నాడు.

"అరె... ఎలక్సన్లు గదరా... ఓట్లు... పొత్తులు... సీటురాని వాడల్లా మరో పార్టీలోకి దూకడం.. వాళ్ళలోనే తన్నుకోటం... రాజకీయాలు తెలవని సారా కాంట్రాక్టర్లు.. డాక్టర్లు... పోలీసులు... ప్రచారానికి సిన్మా వాండ్లు... అంతా ఛండాలం... ఆ కప్పలే బెటర్రా..."

తనకు కప్పభాష వస్తుందా – రాదా అని కంటంగాడు బయట చింతచెట్టుకింద ప్రాక్టీసుకు తగులుకున్నాడు! ★



డా॥ నాగినేని భాస్కరరావు

కామెర్లు = జాగ్రత్తలు



పేదరికం వెక్కిరించే జబ్బుల్లో కామెర్ల రోగం ఒకటి. రక్షిత నీరులేక కామెర్ల వ్యాధి బారిన పడి ఎందరో పేదలు ప్రాణాలు కోల్పోతున్నారు. అజ్ఞానంతో పసరు వైద్యాలనీ, మణికట్టుపై వాతలనీ కొందరు జబ్బును పెంచుకుని ప్రాణాలు కోల్పోతున్నారు. వరదలూ, పుష్కర స్నానాలు, సామూహిక భోజనాలు, అన్నదానాలు, తాగునీటికొరత (1శాతం) ఉన్న భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో కామెర్ల వ్యాధి తీవ్రత సంవత్సరంలో 365 రోజులూ ఉంటున్నది. ఈ కామెర్ల జబ్బు గురించి కొన్ని విషయాలను ఈ వ్యాసంలో చర్చిద్దాం.

'కామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది' అన్న సామెతలోని నిజం నేతి బీరకాయలో నెయ్యి వున్నంత. ఎందుకంటే పచ్చకామెర్ల రోగికి ప్రపంచం పచ్చగా కన్పించదు. కాని కామెర్ల రోగి కళ్ళు, శరీరం పచ్చగా కన్పించి రోగ నిర్ధారణకు ఉపయోగపడుతుంది. కామెర్ల జబ్బు అనేక వందల సంవత్సరాల నుండి మానవజాతిని పట్టిపీడిస్తున్న జబ్బుల్లో ఒకటి. భయంకరమైనది. శ్రద్ధతో జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతుంది. లేకుంటే ప్రాణాంతకమవుతుంది. ఇది కాలేయం వాచిపోవటం వల్ల, వైరస్ క్రిమి వల్ల కలుగుతుంది. కాలేయం పనితీరు దెబ్బతింటుంది. దీనినే కామెర్లు లేదా జాండీసు అంటారు. జానె అనే ఫ్రెంచి పదానికి పసుపురంగని అర్థం. రక్తంలో బైలిరూబిన్ అను పదార్థం ఎక్కువై సెరంబిలిరూసిన్ 2మి.గ్రా.లకన్నా ఎక్కువగా ఉండటం వల్ల హైపర్ బైలిరూబిమారియా పరిస్థితి వస్తుంది. కంటి తెల్లపొర, నాలుక వెనుక భాగం, గొంతు వెనుక గోడలు పచ్చగా మారతాయి. అంతేకాక చర్మం, ఇతర అవయవాల మ్యూకస్ పొరలు, దాదాపు అన్ని ధాతువులు పసుపుపచ్చగా మారతాయి. కేంద్ర నాడీమండలం దీనికి మినహాయింపు.. సాధారణ బైలిరూబిన్ స్థాయి 0.1 నుండి 0.8 మిల్లీ గ్రాములు. కామెర్లలో ఇది ఎక్కువ స్థాయిలో వుంటుంది. కలుషితమైన ఆహార పదార్థాలు, నీరు తీసుకోవడం వల్ల కామెర్ల జబ్బు కలుగుతుంది. మల-నోటి ద్వారాల ద్వారా ఇది వస్తుంది. దీని గురించి తెలుసుకునే ముందు జబ్బు పరిస్థితి అర్థం కావటానికి, కాలేయం, దాని ధర్మాలను గురించి స్థూలంగా పరిశీలిద్దాం.

కాలేయం

మన శరీరంలోని అవయవాల్లో అతి పెద్ద ఘన అవయవం కాలేయం. మగవారిలో దాని బరువు సుమారు 1800 గ్రాములు, ఆడవారిలో 1400 గ్రాములు ఉంటుంది. ఛాతీకింద ఉదరం కుడి పై గది భాగంలో ఇది వుంటుంది. కుడి పక్కటెముకల కింద మనం బాగా గాలి పీలుస్తున్నపుడు కాలేయపు కింద అంచును తాకవచ్చు. కాలేయాన్ని నిర్మాణపరంగా కుడి, ఎడమ భాగాలుగా విభజింపవచ్చు. కుడి భాగం ఎడమ భాగం కన్నా పరిమాణంలో ఆరు రెట్లు ఎక్కువగా వుంటుంది. కాలేయం మన శరీరంలోని జీవ, రసాయనాల ఫ్యాక్టరీ. అంతేకాదు పునరుత్పత్తి శక్తిగల అవయవం.

కాలేయానికి ద్వంద్వ రక్తప్రసరణ కలదు. 1) పోర్టల్ సిర : ప్రేవుల నుండి, ప్లీహము నుండి ఆహారముతో నిండిన సిరల రక్తాన్ని కాలేయానికి తీసుకువస్తుంది. 2) కాలేయపు ధమని : కాలేయానికి ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని సరఫరా చేస్తుంది.

ఈ రక్తనాళాలు పోర్టా (గ్రీకు పదం. గేటు అని అర్థం), హెపాటిస్ అనే చీలిక ద్వారా కాలేయంలోకి ప్రవేశిస్తాయి. ఈ చీలిక కాలేయపు కుడి భాగపు ఉపరితలంలో వుంటుంది.

సాధారణ నిర్మాణం

కాలేయపు కుడి, ఎడమ భాగాలు అనేక చిన్న భాగాలుగా విభజింపబడినవి. మానవ కాలేయంలో ఇటువంటి చిన్న భాగాలు (లోబ్యూల్స్) 50,000 నుండి ఒక లక్ష వరకూ వుంటాయి. ప్రతి లోబ్యూల్‌లో ఒక సిర కేంద్రంగా సిరచుట్టూ వరుసలో స్తంభాల్లా సూర్యకిరణాల అమరికలో కాలేయపు జీవకణాలు వుంటాయి. ఈ లోబ్యూల్ కాలేయపు పనికి ప్రాథమిక యూనిట్. కాలేయపు సైనుసాయిడ్స్ అనేవి కాలేయపు కణపు ప్లేట్ల మధ్య వుంటాయి. కాలేయపు ధమనుల నుండి, పోర్టల్ సిర ద్వారా రెండు విధాల రక్తప్రసరణ ఈ సైనుసాయిడ్స్‌కు లభిస్తుంది. కాలేయపు జీవకణాలు పిత్తరసమును తయారు చేస్తాయి. ఈ పిత్తరసం పిత్తరస నాళికల ద్వారా రక్త ప్రసరణకు వ్యతిరేక దిశలో ప్రవహించి లోబ్యూల్ బాహ్య స్థానానికి చేరుకుని అన్ని లోబ్యూల్స్ నుండి చివరకు కుడి భాగం నుండి ఎడమ భాగము నుండి కామన్ హెపాటిక్ నాళముగా ఏర్పడుతుంది. ఈ నాళము పిత్తాశయం నుండి వచ్చు సస్టిక్ నాళముతో కలిసి కామన్ (బైల్‌డక్టు) పిత్త రస నాళముగా ఏర్పడును. ఈ కామన్ పిత్తరసనాళము, క్లోమము గ్రంథి తల నుండి ప్రయాణించి అక్కడ క్లోమ నాళముతో కలిసిపోతుంది. అవి రెండూ కలిసిపోయి డుయోడిగమ్ అను ప్రేవు రెండవ భాగములోనికి తెరుచుకుంటాయి. ఇది జీర్ణకోశపు పోలోరస్ చివరకు 8 సెం.మీ. దూరంలో వుంటుంది. ఈ తెరచు ద్వారము స్పింక్టర్ ఆఫ్ ఒధయి స్వాధీనంలో వుంటుంది. సాధారణంగా మనిషి రోజుకు 600 మి.లీ. పిత్తరసాన్ని ఉత్పత్తి చేస్తాడు. పిత్తరసం మన రక్తంలో భాగమైన ప్లాస్మాను పోలి వుంటుంది.



కాలేయం ధర్మాలు (జీవక్రియలకు సంబంధించి) :

1. పిత్త రసమును తయారు చేయుట, దానిని బయటకు పంపుట. పిత్తరసం రెండు భాగాలను కలిగి వుంటుంది. ఎ)

బైలిరూబిన్ అండ్ బైల్‌సాల్ట్సు బి) కొలెస్టరాల్. తయారైన పిత్తరసం బైలిరూబిన్ గ్లూకోరోనైడ్‌గా మారి చిన్న ప్రేవు డుయోడినమ్‌లోనికి ప్రవహిస్తుంది. ప్రేవుల్లోని బాక్టీరియా బైలిరూబిన్ గ్లూకోరోనైడును స్టెర్‌కోబైలినోజన్‌గా లేక యూరోబైలినోజన్‌గా మార్చుతుంది. ఈ స్టెర్‌కోబైలినోజన్‌లో ఎక్కువ మొత్తం మలంతో కలిసి విసర్జించబడుతుంది. కొంతమాత్రమే తిరిగి శోషింపబడుతుంది. ముందుగా బైలిరూబిన్ దేనితోనూ కలియదు. ఈ కలియని అన్‌కాంజుగేటెడ్ బైలిరూబిన్ వల్ల కామెర్ల లక్షణం-పసుపు పచ్చవస్తుంది. ఈ అన్‌కాంజుగేటెడ్ బైలిరూబిన్ కాలేయపు ధాతువులో ప్రయాణిస్తుండగా గ్లూకోరోనిక్ ఆమ్లము గ్లూకోరోనిక్ యాసిడ్‌తో అనుసంధానించబడి కన్జెక్టడ్ బైలిరూబిన్‌గా మారుతుంది. ఈ కన్జెక్టడ్ బైలిరూబిన్ నీటిలో కరుగుతుంది. కనుక పిత్తరసంలోనూ, మూత్రంలోనూ విసర్జించబడుతుంది. బైలిరూబిన్ తయారీ, విసర్జన కాలేయపు జీవకణాల ఎంజైములను బట్టి వుంటుంది.

బైల్ లవణములు, ఆమ్లములు

ఇవి కాలేయపు జీవకణాల్లో తయారవుతాయి. వీటికి ప్రాముఖ్యత వున్నది. ఇవి చిన్న ప్రేవుల్లోకి వెళ్ళి శోషింపబడి కాలేయంలోనికి వచ్చి ప్రేవుల, కాలేయపు రక్తప్రసరణలోనికి వస్తాయి. ప్రేవుల్లో కొవ్వు జీర్ణం కావటానికి సహకరిస్తాయి.

కొలెస్టరాల్

కొలెస్టరాల్ శరీరంలోని అన్ని జీవకణాల్లో, జీవద్రవాల్లో ముఖ్యమైన భాగం. దీనివల్ల జబ్బుపడినపుడు పిత్తాశయంలో రాళ్ళు ఏర్పడతాయి.

పిండిపదార్థాల జీవక్రియ

కాలేయంలో గ్లూకోజు, ఫ్రక్టోజు, గాల్టోజు, కొన్ని అమైనోయాసిడ్స్, పైరువేట్ల లాక్టేట్సు, అసిటేటులు మొదలగునవి గ్లైకోజన్‌గా మార్చబడతాయి. ఇది ఇన్సులిన్ ప్రభావంతో కాలేయపు జీవకణాల అంతరంగ ధర్మంగా ఉంటుంది. ఆ విధంగా కాలేయ కణాలు గ్లూకోజును గ్లైకోజెన్‌గా మార్చి కాలేయంలో నిల్వ వుంచుతాయి. అదే విధంగా గైకోజెన్‌ను గ్లూకోజుగా మార్చి దానిని సైనుసాయిడ్స్‌లోనికి



కాలేయ జీవకణం పనితీరు



కాలేయం ముందు దృశ్యం



కాలేయం వెనుక దృశ్యం

విడుదల చేస్తాయి.

గ్లూకోజెనిసిస్

ఆహారంలో పిండి పదార్థాలు తక్కువైనపుడు, మాంసకృత్తులను, కొవ్వు పదార్థాల నుండి గ్లూకోజును తయారు చేయడాన్ని గ్లూకోజెనిసిస్ ఈ విధానం వల్ల అనగా చక్కెరను గ్లైకోజన్ రూపంలో నిల్వ చేసి శరీరానికి అవసరమైనపుడు గ్లూకోజుగా మార్చి సరఫరా చేయుట ద్వారా కాలేయం రక్తంలో గ్లూకోజు స్థాయి నిర్వహణకు కావల్సిన క్రమబద్ధీకరణ యంత్రాంగాన్ని సమకూరుస్తుంది.

మాంసకృత్తుల జీవక్రియ

అమైనో ఆమ్లములను డి-ఎమైనేషన్ చేయటం, అమ్మోనియాను, యూరియాను తయారు చేయటం కాలేయం ముఖ్య ధర్మాలలో ఒకటి.

ప్లాస్మా మాంసకృత్తుల తయారీ

ప్లాస్మా మాంసకృత్తులు, ప్రొటోనోబిన్, ఫైబ్రినోజన్ కేవలం కాలేయంలోనే ఉత్పత్తి అవుతాయి.

ఎమైనో యాసిడ్ల మధ్య అంతర్ మార్పులు కాలేయంలో జరుగుతాయి.

కొవ్వుపదార్థాల జీవక్రియలు

1) లైపోప్రొటీన్ల తయారీ 2) బీటా ఆక్సిడేషన్ ఆఫ్ ఫాటీ ఆసిడ్సు, అసిటోఅసిటిక్ ఆమ్లం తయారీ. 3) కొలెస్టరాల్, ఫాస్ఫోలిపిడ్ల తయారీ, 4) అదనపు పిండి పదార్థాలను, మాంసకృత్తులను కొవ్వుగా మార్చుట.

ఇలా అనేక ముఖ్యమైన ధర్మాలు కలిగిన కాలేయం జబ్బుపడితే ఎలా వుంటుందో ఊహించండి. కామెర్ల రోగిని ఈ కింది విధంగా పరిగణనలోకి తీసుకుని, కావాల్సిన పరీక్షలు చేసి చికిత్స ఇవ్వాలి.

లక్షణాలు : కామెర్లకు మూడు ముఖ్య కారణాలున్నాయి. అవి హెపాటోసెల్యులార్, కొలిస్టాటిక్, హీమోలైటిక్.

హెపాటోసెల్యులార్ కామెర్లకు కారణాలు : 1) వైరల్ హెపటైటిస్ 2) మందులవల్ల కలిగిన జాండీసు లేక హెపటైటిస్ 3) దీర్ఘకాలిక-యాక్టివ్ హెపటైటిస్ 4) సిర్‌హోసిస్ ఆఫ్ లివర్ 5) సారాయి తాగుట వల్ల కలిగిన హెపటైటిస్. వీటిలో సాధారణమైనది వైరల్ హెపటైటిస్. హెపాటో సెల్యులార్ కామెర్లను ఈ దిగువ ఇవ్వబడిన లక్షణాలున్నచో అనుమానించవచ్చు.

(1) జ్వరం రావటానికి ముందు లక్షణాలుంటాయి. ఆ ముందు లక్షణాలు ఏమనగా ఆకలి లేకపోవటం, వాంతి వస్తున్నట్లు వుండటం, వాంతులు కావటం, బలహీనంగా వుండటం, కామెర్లు కనిపించాక జ్వరం నెమ్మదిగా తగ్గుతుంది. ఒకవేళ కామెర్లు కనిపించాక కూడా జ్వరం వస్తున్నట్లయితే అది హెపాటో సెల్యులార్ కామెర్లు కాదన్నమాట. శారీరక పరీక్షలో కాలేయం వాచిపోయి, మెత్తబడి, ముట్టుకుంటే నొప్పికలిగే విధంగా పక్కటెముకల కింద మార్జిన్‌కు 3-5 సెం.మీ. కింద తాకగల స్థితిలో వుంటుంది. ప్లీహమును 10-15 శాతం కేసుల్లో తాకగలము.

వ్యాధి నిర్ధారక పరీక్షలు : కామెర్లు వచ్చాక తప్పనిసరిగా కొన్ని వ్యాధి నిర్ధారక పరీక్షలు చేయించుకోవాలి. ఎ) (1) సీరమ్ బైలిరూబిన్ సాధారణ విలువలు (స్థాయి) 0-3 నుండి 1.0 మి.గ్రా. డియమ్ (ఇవి కామెర్లలో ఎక్కువ స్థాయిలో వుంటాయి) (2) కన్జెక్టడ్ బైలిరూబిన్ 0.3 మి.గ్రా/డిఎల్ బి) మూత్రంలో బైల్‌సాల్ట్స్, బైల్‌పిగ్‌మెంట్స్ : సాధారణంగా మూత్రంలో బైల్‌సాల్ట్స్, బైల్‌పిగ్‌మెంట్స్ వుండవు. కాని కామెర్ల జబ్బులో అవి వుంటాయి.

బైలిరూబిన్ ఎలా వస్తుంది ?

మన రక్తంలోని హిమోగ్లోబిన్‌లోని హీమ్ నుండి, మయోగ్లోబిన్ నుండి, శ్వాసకోశ సంబంధమైన ఇంజైముల నుండి మైక్రోజోమల్ హీమ్ ఆక్సీజినేజ్ చేత విరగగొట్టబడి బైలిరూబిన్‌గా తయారవుతుంది.

బైల్‌పిగ్‌మెంట్ యూరోబైలినోజన్ - వైరల్ హెపటైటిస్, హిమోలైటిక్ జాండీసు, ఆల్కహాలిక్ లివరు జబ్బులో మూత్రంలో ఎక్కువగా వుంటుంది. అబ్‌స్ట్రాక్టివ్ జాండిస్‌లో ఆ రోగి మూత్రంలో యూరోబైలినోజన్ వుండదు. ఎల్.ఎఫ్.టి లివర్ ఫంక్షన్ పరీక్షలు కూడా చేయాలి.

ఇవికాక వైరస్‌ల వల్ల కలిగే కామెర్లను కనుగొనటానికి వైరల్ మార్కర్స్ ఉపయోగపడతాయి.

కామెర్ల జబ్బు వచ్చినట్లు గుర్తు పట్టడం చాలా తేలిక. దానిక్కారణం తెలుసుకుని తగిన చికిత్స చేయించుకోవటం కూడా పెద్ద కష్టం కాదు. నూటికి 90 శాతం కేసుల్లో వైద్యం అక్కర్లేదు. అలాగని అశ్రద్ధ చేయరాదు. స్వంతవైద్యం, నాటువైద్యం అసలు చేయకూడదు. సాధారణ వైరస్‌ల వల్ల కలిగే కామెర్ల గురించి, వాటికి చికిత్స, నివారణ గురించి కూడా తెలుసుకుందాం.

(ఇంకావుంది)

పుస్తక పరిచయం

కారల్ మార్క్స్ జీవితకథ

సోవియట్ రష్యా, తూర్పు యూరప్ దేశాలలో కమ్యూనిస్టు వ్యవస్థలు కుప్పకూలడంతో, మార్క్సిజానికి కాలం చెల్లిందనే వితండ వాదాలు బయలుదేరాయి. ప్రపంచం ఉన్నంత కాలం, వర్గాలు ఉన్నంత కాలం మార్క్సిజం సజీవంగా ఉంటుంది. శ్రమ నుండి, దారిద్ర్యం నుండి ప్రపంచ మానవునికి విముక్తి మార్గం చూపించిన మహనీయుడు కారల్ మార్క్స్. ప్రపంచీకరణ పేరిట ప్రైవేటైజేషన్ పెరిగిపోతున్న ఇవ్వాల్టి పరిస్థితులలో మార్క్స్-మార్క్స్ రచనల ఆవశ్యకత – అధ్యయనాల ప్రాధాన్యతను ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు.

శ్రమచేసే వ్యక్తిని హీనస్థితికి దిగజార్చడానికి మనిషిని మనిషి దోచుకోవడానికి గల కారణాల గురించి శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని రూపొందించడానికే మార్క్స్ తన జీవితాన్ని అంకితం చేశాడు. మార్క్స్ జీవితాశయం ఒకటే – ఎలాగైనా సరే, మానవాళిని దోపిడి నుండి విముక్తి చేసే కర్తవ్యానికి శ్రామిక వర్గాన్ని సమాయత్తం చేయాలి. పీడనను, ఆకలి మంటలను, యుద్ధాన్ని నిర్మూలించాలి. ఆయన ప్రధాన గ్రంథం 'క్యాపిటల్' ఈ ఆశయంతోనే వెలువడింది. 'క్యాపిటల్'లో మార్క్స్ ముఖ్యంగా పెట్టుబడికి, శ్రమకు మధ్యగల సంబంధాన్ని పరిశోధించారు. బూర్జువా వర్గానికి – శ్రామిక వర్గానికి మధ్యగల సంబంధాలను విశ్లేషించారు. శతాబ్దాల క్రమంలో 'పెట్టుబడి' ఎలా పోగుపడిందీ, పెంపొందిందీ వర్ణించారు. పెట్టుబడిదారీ సమాజంలో వర్గపోరాటం బూర్జువా వర్గంపై శ్రామికవర్గ విజయానికే అనివార్యంగా దారితీస్తుందని నిరూపించారు.

అదనపు విలువ సిద్ధాంతం ప్రాతిపదికగా మార్క్స్ ముందుకు తెచ్చిన వాదం తిరుగులేనిది. కేవలం ఆర్థిక పోరాటం ద్వారా మాత్రమే కార్మికవర్గం దోపిడీని నిర్మూలించజాలదు. ఉత్పత్తి సాధనాలపై పెట్టుబడిదార్లకు వున్న యాజమాన్యపు హక్కును ధ్వంసం చేయడమే ఏకైక మార్గంగా తెలియచేశారు. తాను అభివృద్ధి చేసిన గతి తార్కిక విధాన అన్వయంతో ఆయన పెట్టుబడిదారీ వ్యవస్థలోని మౌలిక వైరుధ్యాన్ని బయటపెట్టారు. ఉత్పత్తి సామాజికంగా జరుగుతుంది. ఉత్పత్తి క్రమం రానురాను మరింతగా సమాజ పరం అవుతున్నది. మరోవైపున సామాజికోత్పత్తిని ప్రైవేట్ పెట్టుబడిదారులు కబళిస్తుంటారు. ఈ ప్రధాన వైరుధ్యమే తక్కిన అన్ని వైరుధ్యాలను ఎలా శాసిస్తుంటుందో మార్క్స్ వివరించారు. ఈ ప్రాథమిక వైరుధ్యపు వివిధ రూపాలను బయటపెట్టాడు.

మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలో కమ్యూనిస్టు సమాజం రావడం అనివార్యమని, అది ప్రపంచ వ్యాపితంగా కార్మిక వర్గంపై గల చారిత్రక కర్తవ్యమని చెప్పాడు. పెట్టుబడిదారీ విధానపు నియమాలను వివరించే సందర్భంలో మార్క్స్ సోషలిజాన్ని ఒక ఊహాజనిత రూపం నుంచి శాస్త్రంగా మార్చాడు. క్యాపిటల్‌లో మార్క్స్ శాస్త్రీయ కమ్యూనిజంలోని వివిధ అంశాలను మరింత అభివృద్ధి చేశారు. రాజకీయ అర్థశాస్త్రం, గతతార్కిక చారిత్రక భౌతికవాదం, సోషలిస్టు విప్లవ సిద్ధాంతం, కార్మికవర్గ నియంతృత్వం వంటి వాటిని వివరించే 'క్యాపిటల్' మార్క్స్ సైద్ధాంతిక కృషికి తారాస్థాయి. విస్తృతమైన అధ్యయనం, శాస్త్రీయ పరిశోధనలతో సమకాలికంగా మార్క్స్ మేధావిగా గుర్తింపబడినా, కార్యరంగంలో కార్మికులతో భుజం కలిపి నడిచినవాడు. ఉద్యోగాల కోసం, ప్రభుత్వ ప్రాపకాల కోసం అర్రులు చాచే బూర్జువా మేధావులకు భిన్నంగా తాను నమ్మిన ఆశయాల కోసం మార్క్స్, ఆయన భార్య జెన్నీ, వాళ్ళ కుటుంబం అంతులేని కష్టనష్టాలకు గురయింది. తినడానికి తిండి, ఉండటానికి నీడ కూడా కరువై కష్టాలతో అలమటించినా విప్లవదీక్షతో, అమోఘ త్యాగనిరతితో ఆ కుటుంబం నిలిచింది. పీడిత తాడిత ప్రజల విముక్తి కోసం ఎన్ని కష్టనష్టాలెదురైనా వెనుదిరుగని ఆ మహనీయుని విప్లవజీవితం ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. ఆయన సైద్ధాంతిక విశిష్టతను, రాజకీయ కార్యాచరణను, వ్యక్తిగత ఔన్నత్యాన్ని ఈ పుస్తకం మన కళ్ళముందుంచుతుంది.

- కె.పి.అశోక్‌కుమార్



కారల్ మార్క్స్ జీవిత కథ

తెలుగు : తెలకపల్లి రవి; **వెల :** రూ. 40/-;
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

స్వీ కా రం

పిప్పిపన్ను – చికిత్స

రచన : డా॥ కె.ఎల్.వి.ప్రసాద్; వెల : రూ. 10/-; **ప్రతులకు :** శ్రీమతి కె.అరుణకుమారి, సంరక్ష పబ్లికేషన్స్, 24-7-322/5, రామకృష్ణా కాలనీ, హనుమకొండ, వరంగల్; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

రెక్క తలుపుల గోస

రచన : చింతా అప్పలనాయుడు, సిరికి స్వామినాయుడు; వెల : రూ. 30/-; **ప్రతులకు :** శ్రీ మంచుపల్లి శ్రీరాములు (అధ్యక్షులు, సాహితీ లహరి, పార్వతీపురం); శ్రీ జి.రామకృష్ణ (శాంతి) ఈనాడు రిపోర్టర్ బ్యాంకు వీధి, కురుపాం; ఎ.అప్పలనాయుడు (రచయిత), శ్రీవిశాఖా గ్రామీణ బ్యాంకు, మధురవాడ, విశాఖపట్టణం

పేషెంట్ చెప్పే కథలు

రచన : డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి; **ప్రతులకు :** విజయసమీర పబ్లికేషన్స్, విజయలక్ష్మి నర్సింగ్ హోమ్, మెయిన్‌రోడ్, కాకినాడ; విశాలాంధ్ర బుక్‌హౌస అన్ని బ్రాంచీలు



మధురమైన మామిడి

రచన : కట్టమంచి బాలకృష్ణారెడ్డి; వెల : రూ. 100/-; **ప్రతులకు :** చిత్తూరు డిస్ట్రిక్ట్ అగ్రికల్చరిస్ట్స్ సర్వీస్ సొసైటీ (రిజిస్టర్డ్), సువేరా హౌస్, 15-2294, బాలాజినగర్ కాలనీ, సి.బి.రోడ్, చిత్తూరు.

కొల్లేరు సరస్సు, మంగినిపూడి బీచ్, బందరు గోల్డ్ కవరింగ్ నగలు, కలంకారీ వస్త్రాలు, కూచిపూడి నాట్యం, శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు, ఘంటసాల బౌద్ధారామం, కొండపల్లి బొమ్మలు-ఖిల్లా, కృష్ణానది బంగాళాఖాతంలో సంగమం చెందే హంసలదీవి, పచ్చని పంటపొలాలు విజయవాడ నగరం మినహా ఇవన్నీ కలిసి కృష్ణాజిల్లాకు వన్నెతెచ్చాయి.

కూచిపూడి నాట్యం పుట్టిల్లు కృష్ణాజిల్లా

మచిలీపట్టణం లేదా బందరు ఈస్టిండియా కంపెనీ తూర్పు తీరాన తొలిగా స్థావరం ఏర్పాటు చేసుకున్న ప్రదేశం. 14వ శతాబ్దంలో అరబ్బులు నౌకాయానం ద్వారా వాణిజ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి నిర్మించిన ఈ పట్టణం ద్వారా అనేక శతాబ్దాల పాటు బ్రహ్మాండమైన విదేశీ వాణిజ్యం జరిగింది. ఈ రేవు పట్టణంలోనే ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతిగాంచిన కలంకారీ కళ రూపొందింది. రసాయనాలు లేని సహజసిద్ధమైన రంగులతో అద్దకం వేసి తయారుచేసే ఇక్కడి వస్త్రాలు అన్ని దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి గోల్డ్ కవరింగ్ నగలు కూడా దేశమంతా పేరుపొందాయి. 19వ శతాబ్దంలో ఒక ఆంగ్లేయుడు నిర్మించిన మచిలీపట్టణం చర్చి ఎంతో అందంగా ఉంటుంది. ఇక్కడి పాండురంగ దేవాలయం కూడా ఎంతో ప్రసిద్ధి పొందింది.

మంగినిపూడి బీచ్

బందరుకు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంగినిపూడి బీచ్ పిక్నిక్ ప్రదేశంగా బాగా అభివృద్ధి చెందుతోంది. కార్తీకపౌర్ణమి నాడు ఈ తీరంలో లక్షలాది మంది భక్తులు స్నానాలు చేస్తారు. ఇక్కడ సేదతీరేందుకు అనేక రిసార్ట్స్ నిర్మిస్తున్నారు. కృష్ణాజిల్లాలో గల ఏకైక బీచ్ వద్ద వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

కూచిపూడి

కూచిపూడి నృత్యం ద్వారా విజయవాడకు 60 కిమీ దూరంలో గల ఈ గ్రామం ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందింది. ఈ నృత్యరీతి సృష్టికర్త అయిన సిద్ధేంద్రయోగి జన్మించిన గ్రామం కావడంతో ఇక్కడ సృష్టించబడిన నృత్యానికి ఆ గ్రామం పేరే వచ్చింది. సిద్ధేంద్రయోగి జ్ఞాపకార్థం కూచిపూడిలో ఒక పూర్తిస్థాయి నృత్య కళాశాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఏటా ఉత్సవాలు కూడా జరుపుతారు.



శ్రీకాకుళం

దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితం ఆంధ్రప్రాంతాన్ని ఏలిన శాతవాహన రాజు గౌతమీపుత్ర శాతకర్ణి రాజధానిగా ఉన్న శ్రీకాకుళం ఇప్పుడు ఒక మామూలు గ్రామం. ఇక్కడ కృష్ణా తీరాన గల ఆంధ్రమహావిష్ణువు ఆలయం చారిత్రక ప్రసిద్ధి చెందింది. 1509వ సంవత్సరంలో విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు ఈ ఆలయాన్ని దర్శించి పూజలు చేసినట్లు శాసనాల్లో ఉంది. కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద కావ్యం రాయడానికి ఈ ఆలయం, ఇక్కడి వాతావరణమే ప్రోత్సాహం కలిగించాయని చరిత్ర చెబుతోంది.

కొల్లేరు

మచిలీపట్టణానికి 65 కిలోమీటర్ల దూరంలో సహజసిద్ధంగా ఏర్పడిన మంచినీటి సరస్సుగా కొల్లేరు దేశంలోనే పేరుపొందింది. 300 చదరపు మైళ్ళ విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న ఈ సరస్సులో అక్కడక్కడా గ్రామాలున్నాయి. రష్యాలోని సైబీరియా సహా ప్రపంచం నలుమూలల నుండి ఇక్కడకు అనేకజాతులు పక్షులు వలస వస్తాయి. ఇక్కడ మాత్రమే కనిపించే కొల్లేటి కొంగలు ఒక అరుదైన పక్షిజాతి. ఒకనాడు కొంగలు అనేక ఇతర జాతుల పక్షులు, వందలాది రకాల చేపలతో అలరారుతుండే కొల్లేరు క్రమంగా ఆక్రమణల మయమై అంతరించే దశకు చేరుకుంటోంది.

కొండపల్లి ఖిల్లా

విజయవాడ నగరానికి 16 కిలోమీటర్ల దూరంలో గల కొండపల్లి కొండపై 7వ శతాబ్దం నాటి మూడంతస్తుల రాతికోట ప్రస్తుతం శిధిలావస్థలో ఉంది. దాదాపు 13 వందల సంవత్సరాల పాటు అనేక వంశాల రాజులు, సామంతుల వైభవానికి ప్రతీకగా ఈ కోట కనిపిస్తుంది. ఆంగ్లేయుల కాలంలో దీన్ని సైనిక శిక్షణా శిబిరంగా ఉపయోగించుకున్నారు. ఇక్కడి అడవుల్లో మాత్రమే దొరికే పొణికి కర్రతో తయారు చేసే కొండపల్లి కొయ్య బొమ్మలు ప్రపంచవ్యాప్తంగా పేరుపొందాయి. ★



ఆయన చదివింది కేవలం మూడో తరగతి మాత్రమే.

ఎం.జి.రామచంద్రన్, జెమినీ గణేశన్, శివాజీ గణేషన్, రజనీకాంత్, కమల్‌హాసన్, ప్రేమ నజీర్, రాజ్‌కుమార్ వంటి అగ్రశ్రేణి సినీ హీరోలకు డబ్బింగ్ చెప్పడం నిజంగా వింతల్లో వింతే మరి!

అలా సుమారు 1500 సినిమాలకు డబ్బింగ్ చెప్పారు

అంతేకాదు స్వయంగా 250 సినిమాల్లో కూడా నటించారు

ఇంతటి తన విజయాలకు నేపథ్యం ప్రజానాట్య మండలి. ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీయే అని బల్లగుద్ది చెబుతారాయన

మీ వయస్సెంతా అని అడిగితే 14 ఏళ్లే అంటారు. వాస్తవంగా ఆయన వయస్సు 77 సంవత్సరాలయినా ఆయన మాటల్లో, మానసిక ప్రవృత్తిలో ఇంకా రెండేళ్లు తగ్గించి 12 ఏళ్లే అని చెపితే ఆశ్చర్య పడేంత అరుదైన వాక్పటిమ ఆయనిది.

ఆయనే వల్లం నరసింహారావు

ప్రజానటుడు

వల్లం నరసింహారావుతో ఇంటర్వ్యూ

ఆయనను ఒకసారి స్మృతిపథంలోకి తెచ్చుకోగానే పలు విప్లవ సినిమాలు గుర్తుకొస్తాయి. సినిమాల్లో ఆయన పోషించిన పాత్రలు విలక్షణ రీతిలో ఉంటాయి. ఓ రిక్షా కార్మికుడుగానో, నిరుపేదగానో, దోపిడీదారుల కబంధ హస్తాల్లో చిక్కి విలవిలలాడి పోయే ఓ సామాన్యుడుగానో సినిమా పాత్రల్లో సాక్షాత్కరిస్తారు.

హీరో వేషం వేసినా అతిథి పాత్ర వేసినా ప్రేక్షకుల హృదయాల్లో ఆయనది బలమైన ముద్ర

ఇటీవల గుంటూరు జిల్లా తాడేపల్లి- సుందరయ్య నగర్ వచ్చిన వల్లం నరసింహారావును ప్రజాశక్తి పలుకరించింది. ఆయనతో కాసేపు...

యు.రామకృష్ణ

చిన్నతనంలో పెద్దవాళ్లతో తిరునాళ్లకు, ఉత్సవాలకు పోయిన సందర్భంలో అక్కడ ప్రదర్శించే కళారూపాలు నన్ను అమితంగా ఆకర్షించేవి. ముఖ్యంగా భక్త రామదాసు కీర్తనలు విని పడిచచ్చేవాడిని. పదే పదే వాటినే వల్లె వేసేవాడిని. ఆ విధంగా నాకు తెలియకుండానే కళారూపాలపై మక్కువ పెంచుకున్నాను. ఆ క్రమంలోనే ఆరేళ్ల వయస్సులో రంగస్థలం ఎక్కాను. భక్తరామదాసు కీర్తనలు ట్యూన్‌తోనే ఇతర పాటలనూ మలిచి పాడేవాడిని. ఆ పాటలు జనం విని మెచ్చుకొనేవారు. అది నాకు ప్రోత్సాహంగా ఉండేది.

❖ మరి కమ్యూనిస్టుపార్టీ, ప్రజానాట్యమండలికి మీరు ఎలా దగ్గరయ్యారు?

బెంగాల్‌లో విలయతాండవం చేసిన భయంకర కరువుపై కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు కళారూపాలు ప్రదర్శిస్తూ ప్రజల నుండి పావలా, బేడా వసూలు చేస్తూ, పాత బట్టలు సేకరిస్తుండటం నన్నెంతో ఆకట్టుకుంది. "ప్రళయము పుట్టెను వంగ దేశమున" అంటూ కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు పాడే పాటలు నన్ను భావోద్వేగానికి గురిచేశాయి. ఇక నేను నేర్చుకున్న ఆటా, పాటా కమ్యూనిస్టు పార్టీతో మమేకమయ్యింది. కమ్యూనిస్టుపార్టీకి ఒక సాంస్కృతిక సంఘం ఉంది. అది ప్రజానాట్యమండలి. ఇది ఇప్టాలో ఒక భాగంగా ఉండేది. డాక్టర్ గరికపాటి రాజారావు, దాసరి పెరుమాళ్ళు, కోడూరు అచ్చయ్య వంటివారు ఈ సాంస్కృతిక సంఘంలో పనిచేస్తున్నారు. ఇక నేను కూడా ఆ సంఘంలో పని చేయనారంభించాను. కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం కూడా తీసుకున్నాను. అందులో పూర్తికాలం పనిచేసే కార్యకర్తగా ముందుకొచ్చాను. అప్పట్లో పార్టీ పెళ్ళికానివారికి 25, పెళ్ళయి కుటుంబంతో ఉన్నవారికి 35 రూపాయలు ఇచ్చేది. మా కుటుంబం పెద్దది గావడంతో నాకిచ్చే 35 రూపాయల్లో ఓ ఐదు రూపాయలు ఉంచుకొని మిగతా డబ్బులు కుటుంబానికి పంపించేవాడిని. ఇక అప్పట్నుంచి ప్రజానాట్యమండలి ప్రదర్శించే నాటకాల్లో క్రమం తప్పకుండా నాకు పాత్ర ఉండేది.

❖ ఆనాటి సంచలనాత్మక 'మా భూమి' నాటక ప్రదర్శనల గురించి చెప్తారా?

తెలంగాణాలో కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన రైతాంగ సాయుధ పోరాటం సాగుతున్న కాలం అది. జమీందారులు, పటేల్, పట్వారీల అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పేద రైతు చెర అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో 'మా భూమి' నాటకం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రజానాట్యమండలి నడుం కట్టింది. ఈ నాటకం రాష్ట్రంలో కొన్ని వందల ప్రదర్శనలు ఇచ్చింది. ఒకేరోజు ఒకే వేదికమీద రెండు, మూడు ప్రదర్శనలు ఇచ్చేవాళ్ళం. అయినా జనం ఇంకా

మిగిలిపోయేవాళ్ళు. ఒకే దళంతో ఇది సాధ్యమయ్యే పని కాదని గరికపాటి రాజారావుగారు రాష్ట్ర దళం, కృష్ణాజిల్లా దళంగా విభజన చేశారు. అది కూడా చాలకపోవడంతో ఎక్కడికక్కడ దళాలు తయారు చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు. దీంతో రాష్ట్రంలో 'మా భూమి" నాటకానికి 200 సమాజాలు ఏర్పడ్డాయి. ప్రజలు వందలు, వేలు, లక్షల మంది తిలకిస్తున్నారు. ఆనాడు రాష్ట్రంలో 30 లక్షల మంది ప్రజలు 'మా భూమి' నాటకం చూశారని అంచనా. దీంతో ప్రభుత్వం గంగ వెర్రులెత్తింది. రాజాజీ, ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డివంటి కాంగ్రెస్ ఉద్దండులు స్వయంగా ఈ నాటకాన్ని తిలకించి బెంబేలు చెంది ప్రజల్ని రెచ్చగొట్టేదిగా ఉందని నిషేధం విధించారు. దీంతో మేమంతా జైలు పాలయ్యాం. నన్ను విజయవాడ, గుడివాడ జైళ్ళలో పెట్టారు. చివరికి ఎలాగోలా విడుదల అయ్యాను.

❖ సినిమారంగంవైపు ఎలా వెళ్ళారు?

జైల్లో నుంచి బయటకు వచ్చాక అంతటా అల్లకల్లోలంగా ఉంది. కమ్యూనిస్టుపార్టీ నాయకులను, కార్యకర్తలను చంపి వేస్తున్నారు. ఆ దశలో నేను మా స్వగ్రామమైన కృష్ణాజిల్లా తిరువూరు వదలి మద్రాసు రైలెక్కాను. అక్కడ దర్శకులు ఎల్.వి. ప్రసాద్‌గారి వద్ద చేరాను.

❖ ఏ సినిమాల్లో నటించారు?

ఎల్.వి.ప్రసాద్‌గారు 125 రూపాయల పారితోషికంతో నటుడుగా కుదుర్చుకున్నారు. సినిమా పేరు షావుకారు. ఇందులో హీరోవేషం నాది. హీరోయిన్ షావుకారు జానకి. ఆ తరువాత, 'ప్రపంచం', 'రోజులు మారాయి', 'చంద్రహారం', 'మా గోపి', 'మేలు కొలుపు', 'దేవత', 'ముందడుగు', 'అపనింద', 'అంతా మనవాళ్ళే', 'ముద్దాయి', 'ఎత్తుకు పైఎత్తు' ఇటీవల విడుదలయిన ఇంద్ర సినిమా వరకూ 250 సినిమాలలో పాత్రలు పోషించాను. మాదాల రంగారావు నిర్మించిన పలు చిత్రాల్లో కూడా నటించాను. నేను ఎక్కడ ఉన్నా సమాజంలో పరివర్తన తేవాల్సిన అవసరం ఉన్న పాత్రలనే వేశాను. ఆ రకంగా ప్రజా నటుడుగా నా కర్తవ్యం నేను నిర్వర్తిస్తున్నాను.

❖ డబ్బింగ్ చెప్పడం ఎప్పుడు ప్రారంభించారు?

'ఆహుతి' సినిమా నుండి డబ్బింగ్ చెప్పడం ప్రారంభించాను. ఎంజి రామచంద్రన్, రజనీకాంత్, జెమినీగణేషన్, ముత్తు రామన్, కమల్‌హాసన్, రవిచంద్రన్, నంబియార్, కన్నడ రాజకుమార్, కేరళ ప్రేమ నజీర్ వంటి వారికి గాత్రదానం చేశాను. 1500 చిత్రాలకు డబ్బింగ్ చెప్పాను. టీవీ సీరియల్స్‌లో కూడా నటించాను.

❖ అవార్డులు, రివార్డులేమైనా

ప్రజల ఆదరాభిమానాలూ అభినందనలే అవార్డులుగా నేను భావిస్తాను. ఇక సాంకేతికంగా చూస్తే ప్రభుత్వం, పరిషత్తులు, ఔత్సాహిక నాటక సమాజాలు, నన్ను బాగానే సత్కరించాయి. ఎన్టీఆర్ స్మారక అవార్డుకింద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 25 వేల నగదు పురస్కారంతో సత్కరించారు. ఒక సాంస్కృతిక సంస్థ 10 వేల నగదుతో సత్కరించింది. చాలా సంస్థలు పలు సందర్భాలలో సన్మానించాయి.

❖ కళారంగంలో మీ కుటుంబ సహకారం

నాకుటుంబ సభ్యులందరూ కళామతల్లి బిడ్డలే. భార్య ఇందిర సినీ నృత్య దర్శకురాలిగా పనిచేస్తున్నది. పెద్ద కుమారుడు రాజారావు కెమేరామన్‌గా, చిన్న కుమారుడు కళాధర్ నృత్య దర్శకుడుగా ఉన్నాడు. అల్లుడు సురేందర్ రెడ్డి ఛాయా గ్రాహకుడుగా పనిచేస్తున్నారు. ఇక నా సోదరీమణులు "వల్లం సిస్టర్స్" రాధ, పాపాయి స్వతహాగా కళాకారులు. తిరువూరు ఏరియాలో ఒకనాటి మహిళా బుర్రకథ దళంలో పనిచేశారు.

❖ ఇప్పుడు ప్రజానాట్యమండలితో మీ సంబంధాలెలా ఉన్నాయి

సత్సంబంధాలే. వి.ఏ.దేవి ప్రజానాట్యమండలిలో 20 వేలకుపైగా సభ్యత్వం ఉందని చెప్పాక నా సంతోషానికి అవధులు లేవు. 1500 కళా బృందాలను తీర్చిదిద్దడం చిన్న విషయమేమీ కాదు. దేవి కృషి చూస్తే నాకు గరికపాటి రాజారావు గారి స్ఫూర్తి గుర్తుకు వస్తున్నది. ప్రజానాట్యమండలి మరింత విస్తరించాలని మనసారా కోరుకుంటున్నాను.

❖ ప్రస్తుత ఎన్నికల్లో కళాకారులకు మీరేం చెపుతారు?

నిజమైన ప్రజాసేవకులు ఎన్నికయ్యేందుకు కృషి చేయాలని కళాకారులకు చెపుతాను. డబ్బు లేని వారు ఎన్నికలకు పనికి రావడం లేదు. సమాజ బాగు అంటే దోపిడీ రహిత సమాజమే కళాకారుడి లక్ష్యం. అందుకనుగుణంగా పనిచేసే నిజమైన ప్రజాసేవకులనే తప్పకుండా ఎన్నుకోవాలని కోరుతున్నాను. ★

వెలుగు విషమై

ఇల్లంతా వెలుగు వెల్లువలు
దీపస్తంభం క్రీనీడలో తిమిరం
పెదవి లక్ష్మణ రేఖ గీస్తే
కనుసైగ అరాచకానికి ఉసి
చేయి అకృత్యానికి ఆయుధమైతే
పాదం కావలాకు వకాల్తా!
సూరుణ్ణి చంద్రుణ్ణి కలనేతనేసి
ఆరీ ఆరని పారాణితో
అడుగిడిన హరివిల్లు పూర్ణమ్మను
క్రీనీడలో దాగిన వరకట్నం
ఇంట నిలిచి వెంటాడే ఆయుధం
ఎగిరే పక్షి స్వేచ్ఛలో
వేదన వుందని ఎందరికి ఎరుక –
అన్నదమ్ముల అనురాగ పరిమళం
ఇంటిని వొంటిని తడిపి
ఆస్తి పంపకాల ద్వంద్వ యుద్ధంలో
అన్నను హతమార్చిన తమ్ముణ్ణి
అత్యున్నత న్యాయస్థానం శిక్షించి
తమ్ముణ్ణి యముడికి అప్పగింత
రక్తసంబంధాల అనుబంధానికి
యమపాశపు బంధనాలు –
నట్టింట నెట్టుగట్టిన వడ్లరాశి
ధనరాశై విరాజిల్లిన కర్షకుడు
దండెత్తిన అనావృష్టికి
ముట్టడించిన అప్పుకు
వంగిన వెన్నెముక
పిడి విరిగిన మేడిపట్టి
అసురవేళ ఆత్మహత్య–
కొండంత వెలుగులో
గోరంత గరళం
వెలుగు విషమై
చీకట్లో సంగమం!

– అడిగోపుల వెంకటరత్నమ్

ADVOCATE

న్యాయసలహాలు

ఎ.సత్యప్రసాద్, హైకోర్ట్ న్యాయవాది

మాకు పి.ఎఫ్.సౌకర్యం వర్తించదా?

నేను తపాలా శాఖలో గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులం. మేము టైమ్ రిలేటెడ్ కంటిజెన్సీ ఎలవెన్స్‌పై పని చేయుచున్నాము. అంటే కొందరికి 3 గంటల టిఆర్‌సిఎ, కొందరికి 5 గంటల టిఆర్‌సిఎ ఇస్తుంది తపాలా శాఖ. మాకు పి.ఎఫ్. సౌకర్యం కలుగచేయడం లేదు. అసలు పి.ఎఫ్. సౌకర్యం మాకు వర్తించదా? ఎవరికి వర్తిస్తుంది ? మాలాంటి జి.డి.ఎస్. ఉద్యోగులు ఇండియా మొత్తంపై 3 లక్షల మంది ఉన్నారు. కాని ఏదైనా ఒక సంస్థలో 10 మంది ఉంటే వారికి ఆ సంస్థ పి.ఎఫ్. సౌకర్యం కల్పించాలని చట్టం చెబుతుంది కదా? మా సమస్యను నివృత్తి చేయగలరని ప్రార్థిస్తూ.

– కుమార్, గోపాలపట్నం.

మీకు ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం తప్పనిసరిగా వర్తింపచేయాలి. మీరు మీ యూనియన్ ద్వారా ఈ సమస్యను సంఘటితంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళండి. కాని వక్షంలో ప్రావిడెంట్ ఫండ్ అధికారులకు ఫిర్యాదు చేయండి. అక్కడ కూడా మీకు న్యాయం జరగకపోతే హైకోర్టును ఆశ్రయిస్తే కోర్టు ద్వారా తగిన ఉత్తర్వులు తీసుకోవచ్చు. తద్వారా మీకు తగిన న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

న్యాయం జరుగుతుందా?

నేను 4-03-88 నుండి 31-03-89 వరకు ఎ.పి.ఎస్.ఆర్.టి.సి.లో సబ్-డివిజన్ ఆఫీసు, సివిల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంటులలో ఎన్.ఎమ్.ఆర్.గా పని చేశాను. నన్ను ఆపి తరువాత నాలుగు సార్లు ఇంటర్వ్యూకు పిలిచారు. కాని ఉద్యోగం ఇవ్వలేదు. నేను కోర్టులో కేసు వేశాను. హైకోర్టులో కూడా నేను కేసు గెలిచాను. ఖర్చులు కూడా ఇప్పించారు. ఇంగ్లీషు పదాల వలన సర్టిఫికెట్‌లో సురేంద్రబాబు అని, వారి యొక్క రికార్డులలో సూరిబాబు అని ఉంది. కాని సన్ ఆఫ్ మాత్రం ఒక్కరే. అయినా ఇంటర్వ్యూకు పిలిచి మా రికార్డులలో సూరిబాబు అని ఉంది. సురేంద్రబాబు లేదు అని తిరస్కరించారు. నేను లేబర్ కోర్టులో ఫిర్యాదు చేశాను. కాని ఇంతవరకు విచారణకు రాలేదు. అందుకు మీరు తగిన సలహా ఇస్తారని కోరుచున్నాను. నాకు తగిన న్యాయం జరుగుతుందా !

– తవనం సురేంద్ర బాబు, సంగులపాడు, ప్రకాశం.

ఎపిఎస్ఆర్టీసి వారు పూర్తిగా అర్థంలేని సాంకేతిక కారణాలతో మీకు ఉద్యోగం ఇవ్వడాన్ని తిరస్కరించారు. మీకు అనుకూలంగా హైకోర్టు ఉత్తర్వులు వచ్చిన తర్వాత కూడా సాంకేతిక కారణాలతో ఉద్యోగం ఇవ్వకపోవడం బాధాకరం. అభ్యంతరకరం కూడా. దీనిపై మీరు లేబర్‌కోర్టుకు వెళ్ళినందువల్ల విచారణకు ఆలస్యం జరుగుతుంది. వెంటనే హైకోర్టును ఆశ్రయించి ఉంటే సత్వరమే న్యాయం జరిగి ఉండేది. ఇప్పటికైనా వెంటనే హైకోర్టును ఆశ్రయించండి, న్యాయం జరుగుతుంది.

ప్రయివేటు కాలేజీలో మోసపోయాను

నేను ఓ స్నేహితుడి ద్వారా ప్రైవేటు డిగ్రీ కాలేజీలో ఇన్‌ఛార్జ్‌గా ప్రవేశించాను. లెక్చరర్స్ కొరతగా ఉన్నందున నేను కొన్ని సబ్జెక్ట్‌లు తీసుకుంటున్నాను. అయితే నేను ఎటువంటి అపాయింట్‌మెంట్ లెటర్‌ను వారి నుండి స్వీకరించలేదు. చేస్తున్న పనికి ఇస్తున్న జీతానికి చాలా తేడా ఉంది. నా శ్రమకు తగిన వేతనం లభించాలంటే నేను ఏం చేయాలి? అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వలేదు. కాబట్టి నాకెటువంటి పోరాడే హక్కు లేదంటారా? దయచేసి తెలపండి.

– కె.ఎస్.కుమార్, గాజువాక.

ప్రయివేటు కాలేజీలో మీ నియామకానికి చట్టబద్ధత లేదు. కనీసం నియామక ఉత్తర్వులు కూడా లేవు. మీకు జీతం ఏ పద్ధతి ప్రకారం ఇస్తున్నారో మీ ఉత్తరంలో తెలియచేయలేదు. కాబట్టి మీ ఉద్యోగానికి చట్టబద్ధత లేనంతకాలం మీరు న్యాయపోరాటం చేయడం కష్టం. ఒకవేళ అటువంటిది ఏదైనా చేసినా ఉన్న ఉద్యోగాన్నే నష్టపోయే పరిస్థితి రావచ్చు. ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొనాలంటే మీరు ఒంటరిగా గాకుండా మీ కాలేజీలో లేదా అటువంటి కాలేజీల్లో పనిచేస్తున్నవారు సంఘటితంగా ఇటువంటి అరాచకానికి వ్యతిరేకంగా పోరాడవలసి ఉంటుంది. ఇటువంటి దోపిడీ దాదాపు అన్ని ప్రయివేటు కాలేజీల్లో సహజమైపోయింది. మీకు సమీపంలో ఉన్న సర్వీస్ ఆర్గనైజేషన్‌ను సంప్రదించి తగు సలహా తీసుకోగలరు.

రుచి

ఎగ్ పుడ్డింగ్

కావలసిన వస్తువులు :

పాలు	: పావు లీటరు
గుడ్లు	: రెండు
బెల్లం లేదా పంచదార	: వంద గ్రాములు
యాలకులు	: నాలుగు
ఉప్పు	: చిటికెడు

తయారు చేసే విధానం: పాలు, గుడ్లు (చిన్న సైజు గుడ్లయితే మూడు వేసుకోవచ్చు), బెల్లం లేదా పంచదారను మిక్సీలో వేసి గాని లేదా బాగా కలిసేట్లుగా కలపాలి. యాలకులను మెత్తగా నూరి ఈ మిశ్రమంలో కలపాలి. అందులో చిటికెడు ఉప్పును కూడా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలో పోసి కుక్కర్‌లో పెట్టి ఉడికించాలి. ఇది చాలా మెత్తగానూ, రుచిగానూ ఉంటుంది. పాలు తాగడానికి, గుడ్డు తినడానికి మారాం చేసే పిల్లలు కూడా దీనిని ఎంతో ఇష్టంగా తింటారు. దీని రుచి, రంగు జున్నులాగా ఉంటుంది.

గమనిక

రాష్ట్రంలోని వివిధ జిల్లాలు వివిధ రకాల వంటకాలకు ప్రసిద్ధి. ఆసక్తి గల వారు ఆయా జిల్లాల్లో ప్రసిద్ధమైన వంటకం గురించి, దాని తయారీ విధానం గురించి రాసి పంపితే ప్రజాశక్తి ఆదివారం అనుబంధం రుచి పేజీలో ప్రచురిస్తాము. వంటకం ఫొటోతో పాటు రాసిన వారి ఫొటో కూడా పంపవలెను.

వంటలు పంపవలసిన చిరునామా:
రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, అశోక్‌నగర్, స్ట్రీట్ నెం:1 హైదరాబాద్ 20

ఉలవచారు

కావలసిన వస్తువులు:

ఉలవలు	: పావు కిలో
నీరు	: రెండు లీటర్లు
నూనె	: 25 గ్రాములు
ఆవాలు	: చిన్న స్పూను
ఉల్లిపాయలు	: రెండు పెద్దవి
పచ్చి మిరపకాయలు	: నాలుగైదు
కరివేపాకు	: రెండు రెమ్మలు
కారం	: ఓ స్పూను
చింతపండు	: 50 గ్రాములు
ఉప్పు	: తగినంత
అల్లం	: రెండు అంగుళాల ముక్క
వెల్లుల్లి	: ఒక పాయ
జీలకర్ర	: ఒక స్పూను
కొత్తిమీర	: ఒక కట్ట

తయారు చేసే విధానం :

ఉలవలను శుభ్రంగా కడిగి రాత్రిపూట నాన బెట్టుకోవాలి. తెల్లవారి వాటిని మెత్తగా ఉడికించాలి. వాటిని రెండు భాగాలుగా చేసుకోవాలి. అందులోని నీళ్ళను అలాగే ఉంచాలి. ఒక భాగాన్ని మిక్సీలో వేసి మెత్తగా పేస్టు చేయాలి. రెండో భాగాన్ని తీసివేయాలి. ఒక ఉల్లిపాయ, పచ్చిమిరపకాయలను సన్నని ముక్కలుగా కోయాలి. చింతపండును నానబెట్టి రసం తీసుకోవాలి. అల్లం, వెల్లుల్లి, మిగిలిన ఉల్లిపాయను మెత్తగా పేస్టుచేయాలి. పొయ్యిమీద గిన్నె పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. అందులో ఆవాలు వేసి అవి చిటపట మనగానే కోసి ఉంచుకున్న ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయ ముక్కలను వేసి దోరగా వేయించాలి. అందులో కరివేపాకు వేయాలి. అల్లం వెల్లుల్లి పేస్టును కూడా అందులో వేసి మంచి వాసన వచ్చేవరకు వేయించాలి. అందులో ఉలవల పేస్టు, ఉలవలు ఉడికించిన నీళ్ళను కూడా వేయాలి. దీనిని సన్నని సెగమీద పావు గంట ఉడికించాలి. దించే ముందు కొత్తిమీరను సన్నగా తరిగి కలపాలి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది